UNIVERSAL
LIBRARY
OU_206131
UNIVERSAL
LIBRARY

# ప్రాథమిక స్వత్వములు

గ్రంథకర్త:
సురవరము ప్రతాపరెడ్డి
బి, ఏ., బి, ఎల్.

గోలకొండ ముద్రాక్షరశాల
హైదరాబాదు - దక్కన్
2000 ప్రతులు: 1-11-38

# విషయసూచిక


1. సింహావలోకనము

2. స్వాతంత్ర్య లక్షణములు
   1. భావస్వాతంత్ర్యము,
   2. సమావేశ స్వాతంత్ర్యము,
   3. ఆత్మ స్వాతంత్ర్యము,
   4. మతస్వాతంత్ర్యము,
   5. రచనా స్వాతంత్ర్యము,
   6. వాక్స్వాతంత్ర్యము.

3. కొన్ని అన్యదేశములలోని విధానము
   1. ఫ్రాన్సు,
   2. అమెరికా,
   3. ఇంగ్లాండు,
   4. స్కాట్లాండు,
   5. రష్యా.

4. భారతదేశములో పత్రికాస్వాతంత్ర్యము
   1. ప్రధానఘట్టములు,
   2. ఫలితాలు.

5. హైదరాబాదు రాష్ట్రములో
   1. వార్తానిరోధము,
   2. ఉత్సవములు,
   3. పత్రికలు,
   4. ఐటి.
   5. ఆత్మస్వాతంత్ర్యము,
   6. వ్యాఖ్యానములు,
   7. వ్యాయామములు,
   8. విద్య.
   9. ప్రజాసంరక్షణము.

# దేశోద్ధారక గ్రంథమాల

---

ఈ గ్రంథమాల కీర్తిశేషులయిన విశ్వదాత, దేశోద్ధారక, కళాప్రపూర్ణ కాశీనాథుని నాగేశ్వరరావుగారి స్మారక చిహ్నముగా స్థాపితమైనది.

ఆంధ్రము తప్ప వేరుభాష తెలియని ఆంధ్రసోదరులలో ప్రపంచ జ్ఞానము కలిగించుటకును, పరభాషా వ్యామోహము వలనగాని, విధిలేకగాని మాతృభాషాభిమానము లేని ఆంధ్రసోదరులకు మాతృభాషలో అవసరగ్రంథములను అందుబాటులోనుంచి, మాతృభాషాభిమానము కలిగించుటకును సర్వవిధముల, శక్తివంచనలేకుండ కృషి చేయుటయే ఈ గ్రంథమాల ఆశయము.

ఈ గ్రంథమాలద్వారా ప్రాచీన, ఆధునిక వాఙ్మయ, రాజకీయ, వైజ్ఞానిక, సాంఘిక విషయములకు సంబంధించిన గ్రంథములు ౮౦౦ పుటలకు తక్కువకాకుండ (సంవత్సరమొత్తమున) ప్రకటింపబడును. అప్పుడప్పుడు అనుబంధ గ్రంథావళియు ప్రకటితములగుచుండును.

మా గ్రంథమాలలో ప్రకటితములగు గ్రంథములను కొనుటకు లిఖితపూర్వకముగా నొప్పుకొనువారు గ్రంథమాల సభ్యులుగా పరిగణింపబడుదురు. గ్రంథమాలసభ్యులు ప్రారంభమున నాలుగణాలు ప్రవేశరుసుము క్రింద చెల్లించవలయును. అట్టి సభ్యులకు ప్రతిపుస్తకము నాల్గు అణాలచొప్పున ఇవ్వబడును.

ఈ గ్రంథములే సభ్యులు కానివారలకు ఎక్కువధరలకు విక్రయింపబడును. సభ్యులును, సభ్యులు కానివారలును తపాలావ్యయములను తామే భరించవలయును.

నిజా రాష్ట్ర ఆంధ్రమహాసభ—అభివృద్ధిపక్ష సభ్యులు ప్రవేశ రుసుము చెల్లించి గ్రంథమాల సభ్యులుగా చేరకున్నను, వారికి గ్రంథమాలసభ్యులకు చూపు సౌకర్యములు చూపబడును. కాని అభివృద్ధిపక్షసభ్యులు తపాలా వ్యయములు పంపినచో పుస్తకము వి.పి. గా పంపబడును. అభివృద్ధిపక్షసభ్యులు తా మట్టిసభ్యులయినట్లు ధృవపరుచుకోవలెను.

మా గ్రంథమాల సభ్యులు మేము పంపిన వి.పి. ని తిరుగ గొట్టినచో, వారు తమ సభ్యత్వమును కోలుపోయెదరు. ఒకవేళ తిరిగి సభ్యత్వమును గోరినయెడల ఇదివరకయిన తపాలనష్టమును చెల్లించవలసి యుండును.

ఈ గ్రంథమాలకు అనుబంధముగా హైదరాబాదు రాజ్యాంగమునకు సంబంధించిన చట్టములు, నియమావళులు, గష్తీలు మొదలగువానిలో ముఖ్యములయినవి, రైతుసోదరులకు సంబంధించినవి ఆంధ్రీకరించి ప్రకటింపబడును. ఈ అనుబంధ ప్రచురములను గ్రంథమాల సభ్యులు కొనవలయునను నిర్బంధములేదు. కావలసిన వారికి పంపబడును. అందరకు ఒకే ధరకు విక్రయింపబడును.

వట్టికోట ఆళ్వారుస్వామి,
ప్రకాశకుడు

## దేశోద్ధారక గ్రంథమాల

౨౮౪౪, ఇమాంబావివీధి, సికింద్రాబాదు.

# పీఠిక

ప్రాథమికస్వాత్వములు అను పేరిట శ్రీ ప్రతాపరెడ్డిగారు వ్రాసిన గ్రంథము తరుణములో ఆంధ్రులకు అందజేయబడినందుకు వారికి మా కృతజ్ఞతను దెలుపవలసి యున్నది. అట్టి కృతజ్ఞతను తెలుపు ఈ సందర్భమున రెండు మాటలు ఈ మౌలిక హక్కులను గురించి చెప్పదలచినాను.

మన దేశములో బ్రిటిష్‌గవర్నమెంటువారు రాజ్యమును స్థాపించినది మొదలు మనయొక్క ప్రాథమికహక్కులనేటట్టి ఆలోచనయే మన కంతగా కాన్పించలేదు. కాంగ్రెసు రాకముందు జాతీయభావాలలో నడుపబడు వార్తాపత్రికలకు ౧౮౭౭వ సంవత్సరము ప్రాంతములో అనగా అప్పటి ధాత, ఈశ్వర సంవత్సరముల నాడు కొంత అవరోధము కల్పింపబడినదని చరిత్ర మూలముగా మనకు తెలిసినది. కాని ఆ యవరోధము వెంటనే తొలగింపబడి, క్రమ క్రమముగా కాంగ్రెసు అనే సంస్థ బలముచెందిన కొలది ప్రజలకు సహజముగా వుండేటట్టి కొన్ని హక్కులను వారు స్థిరపరుచుకొనగలిగిరి. (ఇట్టి హక్కుల వివరములు ఈ గ్రంథమునందు స్పష్టీకరింపబడినవి.) కాని రానురాను ఈ హక్కులు క్రమముగా సంకుచితము చేయబడినవి. ఒక ప్రక్కను మనము స్వరాజ్యమునకై యత్నించుచుండ రెండవప్రక్కను చిరకాలమునుండి మన అనుభవములో ఉన్నవని మన మనుకొంటూవున్న ప్రాతిపదికహక్కులన్నియు నశింపు చేయబడినవి. ౧౮౯౭ వ సంవత్సరమువరకు ఏ విధమైన తొందరలును కలిగియుండలేదు. అనగా కాంగ్రెసుపుట్టిన ౧౨ సంవత్సరములవరకు నిరాఘాటంగా సభలు జరుపుకొనడము, పత్రిక

లలో వ్రాయడము, మహజర్లు పంపడము, ప్రజలయొక్క స్వేచ్ఛకు భంగము లేకుండడము సంభవించుచుండెడిది. పిమ్మట ౧౮౯౮ వ సంవత్సరములో ౧౨౪ ఎ. అనిన్నీ ౧౫౩ ఎ. అనిన్నీ రెండు సూత్రములు శిక్షాస్మృతిలోచేర్చి గవర్నమెంటువారు రాజద్రోహపు నేరమును క్రొత్తగా నిర్వచించి, ప్రజలలో అంతశ్శాఖగా విభేదములను కల్పించెడి నేరమును మరియొకదానిని కల్పించి ఈరెంటి సూత్రాలమునను అనేకమందిని శిక్షించుటకు ప్రారంభించారు. దానికి ప్రథమమున ఆహుతి అయినవారు బాలగంగాధరతిలక్ గారు. తిరిగి బెంగాల్ విభజన ౧౯౦౫ వ సంవత్సరములో అయిన పిమ్మట బయలుదేరిన జాతీయ మహోద్యమ సందర్భమున అనేకమంది అనేక విధములైన యిక్కట్లకులోబడవలసి వచ్చినది. సభలు ఆపివేయడము, ౧౯౦౭ వ సంవత్సరములోని బారిసాలు పట్టణమందు సురేంద్రనాథ్ బెనర్జీ మీద లాఠీచార్జీలు జరపడము, వూరేగింపులు, సభలు నిషేధించడము, విద్యార్థుల హక్కులు తగ్గించడము, రాజకీయములలో పాల్గొనరాదని నిషేధించడము, పత్రికలయొక్క స్వాతంత్ర్యమును నిరోధించడము ఈ మొదలైన చర్యలు ౧౯౦౬--౧౯౦౭ మధ్యను విశేషముగా జరిగెను. పిమ్మట తాత్కాలికంగా చేయబడ్డ శాసనమును శాశ్వతంగా చేయదలచి ౧౯౦౭ వ సంవత్సరములో రాజద్రోహ నేరపు సభల శాసనమును (Seditious meetings Act) ౧౯౦౭ సంవత్సరమునందును, ముద్రాలయముల శాసనమును ౧౯౧౦ సంవత్సరమునందును, ౧౯౧౨ సంవత్సరమునందు క్రిమినల్‌లా అమెండుమెంటు శాసనమును, ౧౯౧౪ సంవత్సరమునందు Indian Dora రేలం సంరక్షణశాసనము ("Defence of the Relam Act" అనిసామాన్యంగా పిలువబడే (Defence of Indian Act) భారతదేశ సంరక్షణ శాసనమును చేసిరి. ౧౯౧౯ లో యుద్ధము కాగానే ఈపై శాసనములు రద్దుకావలసి యుండెను. గనుక దాని

స్థానే రౌలట్ (Rowlatt) శాసనమును స్థాపించి సత్యాగ్రహ ప్రారంభమునకు గవర్నమెంటువారు కారణమును కల్పించినారు.

మహాత్మాగాంధీగారు మొదటినుండియు రాజభక్తులై దక్షిణాఫ్రికాలో "జులు" తిరుగుబాటులోను, బోయర్ల తిరుగుబాటులోను (Ambulance) అంబూలెన్సు పార్టీలను ఏర్పాటుచేసి యుద్ధములో బ్రిటిష్‌వారికెంతయు సహాయముచేసిరి. ౧౯౧౪ వ సంవత్సరములలో యూరపు మహాసంగ్రామములో బ్రిటిష్ వారి తరపున సిపాయీలను (Recruit) చేర్చుకున్నారు. కాని ౧౯౧౯ సంవత్సరములో ఎప్పుడైతే "రౌలట్" శాసనముద్వారా యుద్ధశాసనమునకనువైన "ఇండియన్ డోరా"ను శాశ్వతంగా, చిరస్థాయిగా ఏర్పాటు చేయుదలచిరో అప్పుడు సత్యాగ్రహ అస్త్రమును బ్రిటిష్ వారిపై ప్రయోగింప నిశ్చయించి అప్పటి సందర్భములలో ప్రజలు అహింసాతత్వమును సమగ్రముగా గ్రహించని కారణముచేత ౧౯౧౯ సంవత్సరము జూలైలో దానిని విరమించుకొన్నారు. కాని ఆ బీజము మాత్రము భూమియందు నాటబడి క్రమముగ మొలకెత్తి, మొక్కయై, వృక్షమై, ఫలప్రదమై ఇప్పటికిని విరాజిల్లుచున్నది. ౧౯౨౧వ సంవత్సరములో గవర్నమెంటువారు ఒక కమిటీని ఏర్పాటుచేసి ప్రజాస్వాతంత్ర్యము నరికట్టు శాసనములనన్నిటిని రద్దుచేసిరి. కాని ఒక్క (Criminal law amendment Act) క్రిమినల్ లా సవరణ శాసనమును మాత్రము అమలులో నుంచిరి. అప్పటినుండి ఇప్పటివరకు అది అమలులోనే యున్నది. ఇటీవల ౧౯30 వ సంవత్సరములో జరిగిన ఉప్పుసత్యాగ్రహ సందర్భములోను, 3౨, 33 సంవత్సరముల ఉద్యమములలోను నూతన నిర్బంధశాసనములు శాసనసభలో నిమిత్తము లేకయే తాత్కాలికముగా అమలులోనికి తేబడి చివరకు వీటి సారాంశమంతయు ౧౯౩౨ సంవత్సరములో శాసనసభలో మూడు సంవత్సరములు కాలము అమలులో వుండేటట్లుగా శాసనరూపము దాల్చినవి. వీటి నన్నిటిని బట్టి చూ

డగా ఇండియాయొక్క పరిస్థితులు తలక్రిందులైనట్లు కాన్పించినవి. మనము రొట్టె అడుగుతూవుంటే వారు రాయి ఇచ్చినట్లుగా మనము వున్న హక్కులనుపెంచి స్వాతంత్ర్యము, స్వరాజ్యముకొరకు ప్రయత్నము చేస్తూంటే వారు వున్న స్వాతంత్ర్యమును పోగొట్టి క్రొత్త లోపమును కల్పించుట తటస్థించినది. ఇట్టి నీతివలన లేని దానిని అడిగితే అది రాక పోవడమే కాకుండా, వున్నది కూడా వూడిపోవుట తటస్థించగా ప్రజలమనస్సు, శ్రద్ధ, ధ్యానము దీనిపైయుంచి పోగొట్టుకొన్నదాని కొరకు వినియోగింప కృతనిశ్చయులైరి తదనుసరణముగా ప్రజలయొక్క లక్ష్యము యావత్తున్ను అదివరకు చిరకాలమునుండియుతమకుదొరకినవనుకున్న హక్కులను పోగొట్టుకొన్నామే అనేచింతలో సంకుచితమైపోయిన దానికొరకు యత్నించగా, వుండిపోయినదానిలో ఏ సగమో లభించడము అంతటితో సంతుష్టి చెందడము తటస్థించింది.

౧౯౩౦ వ సంవత్సరములో ఈదృష్టి యావత్తు మారింది. ఏశాఖ ఆలోచించినా—విద్యాశాఖగాని, ఆర్థిక శాఖగాని, సైనిక శాఖగాని, వర్తక, వాణిజ్యశాఖలుగాని పరిశ్రమల శాఖగాని, రైతు శాఖగాని, నాణెముల శాఖగాని, నోట్లశాఖగాని, బ్యాంకుల శాఖగాని, భీమాల శాఖగాని—ఏదిచూచినాకూడా మనకు, స్వరాజ్యమునకు ఏ హక్కున్ను లభించజాలదనే మనోనిశ్చయముతో ప్రజలు ప్రాతిపదిక హక్కులలోనే స్వరాజ్యము ప్రప్రాతిపదికమని కనిపెట్టి దానికొరకై ఏకాయత్తచింతతో, తదేకదృష్టితో ప్రయత్నము చేయసాగిరి.

ఇది ఇట్లుండగా దేశములో ఎన్నివిభాగములు కల్గినవో తేటతెల్లమయినది. ఇండియాను పరిపాలించిన బ్రిటిషువారు ఈదేశమును విభాగించి ఎక్కడికక్కడ ఆయాప్రాంతముల కనుకూలమైన

రాజనీతి నవలంబించి పరిపాలనను జయప్రదంగా కావించుకొన్నారు. ఒకప్రక్క దేశమునంతను ౧౧ రాజధానులుగను, ౫౬౧ సంస్థానము లుగను విభజించినారు. ఇది దేశమునకున్న నిలువుకోత. అడ్డుకోతగా హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు, హరిజనులు, సిక్కులు, స్త్రీలు, పురుషులు అనే విభేదములను కల్పించి వారికందరికి వివిధములగు నియోజకవర్గములు స్థాపించి, ఒకరి నియోజకవర్గము నకు మరియొకరు ప్రాధాన్యము వహించుటకు వీలులేకుండా చేసినా రు. ఇదేకాక అడుగుకోతలు, ఐమూలకోతలు కోసి పల్లెటూరివారు, పట్నములవారు అనే విభజనను, ఏజెన్సీవారు, సమతల ప్రదేశముల వారు, అనే విభజననుకల్పించి దేశమందుండెడి 3౫ కోట్లలోను స్వ దేశసంస్థానములలో వుండెడి ౯ కోట్ల జనమునకు వోట్లు లేకుండా చేయడమేకాకుండా బ్రిటిషురాజ్యములో వుండేటట్టి మిగిలిన ౨౬ కోట్లలోను కోటిన్నర ప్రజలకు ఏజెన్సీ వున్నకారణముచేతను వోట్లు లేకుండాచేసినారు. కాబట్టి ఈవివిధములగు విభాజ్యములవల్ల స్వదేశ సంస్థానములలో వుండేప్రజలు అచేతనములగు వస్తువులుగా పరిగ ణింపబడి వోటు అనే సంపర్కము వాసనలేకుండా పశువులవలె మె లగవలసివచ్చినది. ఈ పరిస్థితులను గమనించి హరిపుర కాంగ్రెసు అయిన వెంటనే కన్యాకుమారి మొదలుకొని కాశ్మీరువరకు సంస్థాన ప్రజలు యావన్మందిన్ని ఒక నూతనప్రభోధమునుపొంది తమ యొక్క వోటుకొఱకున్ను ప్రాతిపదిక హక్కులకొరకున్నూ య త్ని ంచు చు న్నా రు. ఈ వి ష యా న్ని లోథియన్ ప్రభువున్ను, శామ్యూల్ ప్రభువున్ను ఈ దేశములో పర్య టనములుగావించి చక్కగాగ్రహించి ఇండియన్ ఫెడరేషనందు స్వదేశసంస్థానప్రజలకు వోట్లులేకుండాచేయుట న్యాయముకాదని స్పష్టీకరించిరి. కాశ్మీరములో ఈరోజున ఏడువందలమంది రైతులు న్నారు. అందులో ౬౦౦ మంది మహమ్మదీయులు, తక్కినవారు హిందువులు, సిక్కులుఅయి వున్నారు. వారందరు తమహక్కులకో

లకు పోరాడుచున్నారు. ఆవుద్యమము ఏవిధమైన దౌర్జన్యములే కుండా సాగుచున్నది. కాని హిందువులు, మహమ్మదీయులు, సిక్కు లు ప్రత్యేకశాఖలుగా ఈఆందోళన జరుపుచున్నారు. కాని వారొ కజాతీయ సంస్థగా తమయొక్కమతాలబా (కోర్కెలను) స్పష్టీక రించుటలేదు. అటుపిమ్మట దక్షిణమునకు ప్రయాణముచేయగా పాటియాలలో పూర్వపుమహారాజు చనిపోయిన పిమ్మట ఇప్పటి మహారాజుగారు ప్రజలయొక్క హక్కులకు సుముఖంగా వున్నప్పటి కిని పూర్వము తమతండ్రిగారుచేసిన అపకృత్యములకొరకు సరియైన పరిహారము కల్గించలేకపోవుటచేత పాటియాలసంస్థానములో పెద్ద ఆందోళన యుత్పన్నమైనది. కాని ప్రజలహక్కులను నిర్ణయించుట కొరకు ఉపసంఘ మేర్పడినది. పాటియాలా సంస్థానములోను, కపు ర్తలా, ఇందూరు, మైసూరు మున్నగు సంస్థానములలోను తలొక ఉపసంఘమును స్థాపింపబడి ప్రజలయొక్క హక్కులను విపులముచేయు టకు ప్రయత్నములు జరుగుచున్నవి. ఉదయపురములో అనేకమంది నిర్బంధములో వున్నారు. ఆళ్వారులో కాంగ్రెసు పావలామెంబర్లుగా చేరినందుకు ఖైదులో పెట్టబడ్డారు. రాజకోటలో తక్కిన సంస్థాన ములలోవలెనే ఉప్పు, నిప్పుపుల్లలు, పంచదార తమలపాకులు మొదలైన సామాన్య వస్తువులను స్టేటుకు మోనాపలీగా వుండుట కు వీలులేకుండా స్టేటుకు సంబంధించినవ రాజబంధువులకో మోనాపలిగా వుంచుట ఏర్పాటైనకారణముచేత ౨౦ వేలమంది సత్యాగ్ర హములోచేరి, నిషేధింపబడినట్టి ఈ వస్తువులను చిన్నచిన్న ప్యాకె ట్లుగా ఏర్పాటుచేసి వీధులలో విక్రయించుచున్నారు. (Sir Patrick Caddell) సర్ పాట్రిక్ కాడెల్ అనే వుద్యోగి ౪౦ సంవత్సరముల అనుభవముగల్గిన జునగాఢ్ స్టేటుకు దివానుగావున్న ఆంగ్లేయుడు. ఈ మోనాపలీకి పూర్తిగా అననుకూలంగావుండి దాని నెత్తివేయమని సలహానిచ్చుటచేత ఈ మంత్రిని బర్తరఫుచేశారు.

మాన్సాసంస్థానములో ౧౦ గ్రామములు మాత్రమే వున్నవి. ౧౨ వేల జనాభాగలదు. ౧౦ లక్షల ఆదాయము గలదు. ఇక్కడ అడవిలోనుంచి కట్టెలు కొట్టుకొనుటను నిషేధించుటచేత అక్కడపురుషులు, స్త్రీలు అడవికిపోయి అడవిలో వలయాకారంగా కాపులు వేసుకొని సంస్థానమునకు సంబంధించిన అధికారులు తమవస్తువులు ముట్టుకోకుండా కాపాడుకొన్నారు. చివరకు మాన్సాసంస్థానములో రాజీనామా కుదిరినది. ఇదేవిధంగా దక్షిణమహారాష్ట్ర సంస్థానములలో రామదుర్గ్, మీరజ్‌సీనియరు, మీరజ్ జూనియరు, జమఖండి, కొల్హాపూరు, ఇచ్ఛల్‌కరంజి, ఈ సంస్థానములలో సత్యాగ్రహము బాగుగా జరుగుచున్నది. మైసూరులో జరిగిన విషయము చరిత్రాత్మకమైనదే. తిరువాన్కూరులోకూడ బాగుగాజరుగుచున్నది. వీటన్నిటికంటె వెనుకబడినట్టి ఒరిస్సా రాష్ట్రములోని ౨౬ సంస్థానములుకూడ ఒక్కసారి ప్రబోధము నందినవి. అన్నిటికంటె నిరంకుశప్రభుత్వము కలిగినట్టి ఢెంకనల్ సంస్థానములో తీవ్రమైన సత్యాగ్రహాందోళన జరుగుచున్నది. ఆవిధముగానే టాల్‌చర్ సంస్థానములోకూడా జరుగుచున్నది. ఢెంకనల్ సంస్థానములో యూరోపియన్ పటాలములువచ్చి వారము రోజులు తమయిష్టమువచ్చినట్లు గ్రామములను నశింపుచేసి, ఇళ్లనుకాల్చివేసి, ప్రజలను తుపాకులతో కాల్చి ౭ రోజులయినపిమ్మట "యూరోపియన్ సేనలు తమకార్యమును తీర్చుకొని తిరిగివెళ్ళిపోయెను" అనే ప్రకటనతో ఈ యుదంతమును ముగించిరి.

ఈ విధముగా [illegible]౨౧ సంస్థానములలో మహోద్యమము ప్రారంభమై ప్రజలయొక్క ప్రాతిపదిక హక్కులకొఱకు పోరాటము సలుపబడుచున్నది. ఇంకా హైదరాబాదు సంస్థానమునుగురించి చెప్పనక్కరలేదు. ఈ పుస్తకము ఆసంస్థానములోనే ప్రకటింపబడుచున్నందున ఆసంస్థానమువారికి సర్వము తెలియును. గావున

దానివిషయమై ఏసంగతియు విశేషముగా చెప్పకయే సర్వజనులకు వివరములన్నియు తెలియుచున్నవి.

కావున ప్రజలయొక్క హక్కులకొఱకు ఆందోళన ఎక్కువైన కొలది వున్నహక్కులు పోతవి అనుట నిశ్చయము. క్రొత్తఇల్లుకట్టుటకు పాతఇల్లు పడగొట్టవలెను. ఇట్టిసమయమున ఈగ్రంథకర్తయగు శ్రీ ప్రతాపరెడ్డిగారికి మనమెల్లరము కృతజ్ఞత తెలుపవలసియున్నది.

మఛిలీబందర్<br>౨౫-౧౦-౩౮ } భో॥ పట్టాభి సీతారామయ్య

# ప్రాథమిక స్వత్వములు

## సింహావలోకనము

మానవుడు స్వాతంత్ర్య కాంక్షి. ప్రపంచ చరిత్రలో మానవుని స్వాతంత్ర్య సమరము ముఖ్యమైన ఘట్టము. ఆదికాలమునుండియు నేటివరకు సర్వప్రాంతములలో మానవులు ఆత్మస్వాతంత్ర్యముకై నిర్విరామముగా పోరాడుచు వచ్చినారు. నాగరికతలేని మొరటు కాలములోను మనుష్యుడు స్వేచ్ఛావిహారిగా నుండుటకే యిష్టపడుచుండెను. గుంపులు గుంపులుగా మానవులు పచ్చిక బయళ్లలో సంచరించిన కాలమందును, పగల యొత్తిడినుండి తప్పించుకొనుటకై నాయకుల నేర్పాటు చేసికొనిన కాలమందును, వ్యవసాయాది వృత్తులను వృద్ధిపొందించి ప్రభుత్వమును దానిని నేర్పాటుచేసి కార్యవిభజనము చేసిన నాడును, మానవుడు తన స్వేచ్ఛలో లోపము కలిగినప్పుడెల్ల ప్రతిఘటించుచు వచ్చెను. ప్రపంచమందలి స్వేచ్ఛాసమర చరిత్రను ఎవ్వరును నేటివరకు సరిగా వ్రాయలేదు. ఎందరో మహానుభావులు లోకకల్యాణార్థమై తమ జీవితములను సహితము అర్పించుకొనిరి. ఎందరో విస్మృతులైనవారు తమ స్వేచ్ఛాభావములకై ఆత్మబలిదానము చేసి పోయిరి. అందు కొందరి పేరులు మాత్రమే చరిత్ర కెక్కినవి.

మానవులు ఆదికాలములో తమ తమ నిత్య వ్యవహారములు సక్రమముగా జరుగుటకై కొన్ని కట్టుబాట్లు చేసిరి. వ్యవహార విభజనము చేసిరి. అదియే ప్రభుత్వమనిపించుకొనెను. అట్టి ప్రభుత్వమును సాగించుటకై ఒక పెద్దను నియమించుచు వచ్చిరి. అతడే రాజయ్యెను. ఆ రాజునకు సహాయార్థము మంత్రాంగ మేర్పడెను. అట్టి రాజులు పలుమారులు నిరంకుశులై తమ అధికారమును దుర్వినియోగము చేసి దేశములను, ప్రజలను, ప్రజల సౌఖ్యములను నాశన

ము చేయుచు వచ్చిరి. ప్రజలలో ఐకమత్యము బలము లేనంతకాలము నిరంకుశ ప్రభువుల యాటలుసాగుచు వచ్చెను. ప్రజలలో బలము కలిగిన నాడు నిరంకుశులను కూలద్రోసి మంచివారిని ఏర్పాటు చేయుచు వచ్చిరి. ఈవిధముగా దాగిలి మూతల వలె నిరంకుశ ప్రభువులకును ప్రజలకును నిరంతరము సంఘర్షణములు జరుగుచు వచ్చెను.

రాజులైనవారు ఆదిలో ప్రజల సేవకులుగా నుండుచువచ్చిరి. అదియే ప్రాథమికోద్దేశముగా నుండెను. ఉత్తమ రాజ్యాంగ పద్ధతి నేర్పాటు చేయుటలో దక్షులైన ప్రాచీన జాతులలో నీపద్ధతియే యుండెను. గ్రీసు యొక్కయు, రోము యొక్కయు, ఆర్యావర్తము యొక్కయు చరిత్రలను జూచిన ఈవిషయము బోధపడగలదు.

భారతదేశములో రాజ్యాంగ తంత్రమును వార్తాశాస్త్రమనిరి. మహాభారతములో ఆరణ్యోద్యోగ శాంత్యనుశాసనిక పర్వములలో చాలభాగములందు రాజ్యాంగ తంత్రములు బహుళముగా చర్చించ బడెను. భారతమందు వార్తాశాస్త్ర ప్రాముఖ్యమిట్లు కొనియాడబడెను.

“ వార్తయందు జగము వర్తిల్లుచుండును
అద్ది లేనివేళ అఖిల జనులు
అంధకారమగ్నులగుదురు గావున
వార్త నిర్వహింప వలయు పతికి”

ఇందు వార్తాశబ్దమును ఆధునికులు వార్తాపత్రికలలో “వార్త”లకు సంబంధించినదిగా పొరపాటు పడినారు. ధర్మశాస్త్రములలో “వ్యవహార కాండ” ఒక ముఖ్య భాగము. గౌతముడు, యాజ్ఞవల్క్యుడు, శుక్రుడు, బృహస్పతి, మున్నగు ఋషులు రాజ్యాంగ తంత్రమును బాగుగా చర్చించినను తర్వాతి కాలములో మనుస్మృతికే ప్రాధాన్యత వచ్చెను. అట్లుండినను ఈచర్చలో అగ్రస్థానము చాణక్యునికే యియ్యవలసి యుండును. అతని యర్థశాస్త్రము ౨౨౦౦ పండ్లకు పూర్వము వ్రాయబడినదైనను ఈనాటి పాశ్చాత్య రాజకీయ

నేత్రులకు ఆశ్చర్యము గొలుపుచున్నది. ఇట్టి యపూర్వ చర్చచేసిన చాణక్యుని మనవారు విస్మరించి గ్రీకుల అరిస్టాటల్, ప్లేటోలను పొగడ చొచ్చుట పరాధీన పరాభవముల వలన జనించిన భావ దౌర్బల్యము. తర్వాతి కాలములో కామందకుడు, మహారాష్ట్రములో శివాజీ ఛత్రపతి గురువగు సమర్థరామదాసు ఈచర్చలో ముఖ్యముగా పేర్కొనదగిన వారు.

పూర్వము భారత దేశ చక్రవర్తులు ప్రజానురంజకులుగా నుండినట్లు ఇతిహాసములలో అనేక నిదర్శనములు కలవు.

దశరథుడు తనకుమారుని పట్టాభిషేకమునకై తన ప్రజల అనుమతి కోరెను. గ్రీసుదేశములోని ఏథెన్సు, స్పార్టా, నగర రాజ్యములలో ప్రజా పరిపాలనమే ప్రాధాన్యత వహించెను. ఆర్యావర్తములో దుష్టుడగు వేనరాజును సంహరించిరి. రోములో టర్క్విన్ రాజుల నిరంకుశత్వమును ప్రజలు ప్రతిఘటించి వారిని తొలగించి ప్రజాపరిపాలనము స్థాపించిరి. బుద్ధునికాలమునకే ఆర్యావర్తములో లచ్ఛవిక, మాళవ మున్నగు ప్రదేశములలో నైరాజ్యములు (రిపబ్లికులు) స్థాపితమాయెను. జూలియస్ సీజరువంటి యుత్తమ రాజునుగూడ సహించక అతనిని చంపివేసిరి. ఇట్లుండినను రాజత్వమునిరంకుశ నియంతృత్వము పలుమారు తలయెత్తుచు వచ్చెను. రాజ్యాధికారమును వహించిన ప్రభువులు మతాచార్యులను లోబరచుకొని వారిద్వారా ప్రజలలో రాజు దైవాంశ సంభూతుడనువ్యామోహము వ్యాపింపజేసిరి. "నావిష్ణుః పృథివీపతిః" అనునొక తప్పుడు శాస్త్రమును ప్రచారము చేసిరి. ఇంగ్లాండులో 300 యేండ్లక్రిందటి రాజగు మొదటి జేమ్సురాజు "రాజులయొక్క దేవాంశ సంభూతమైన స్వత్వము" (Divine right of Kings)అను సిద్ధాంతమును స్వయముగా వ్రాసి ప్రచారము చేసికొనెను. తత్ఫలితముగా అతనికి "క్రైస్తవ దేశములలో అత్యంత బుద్ధిమంతుడైనమూర్ఖుడు"(Wisest fool in Chrastendom) అనుబిరుదమును ప్రజలు ప్రసాదించిరి. ఇస్లాములోను మొదట పరిపాలనము చేసిన ఖలీఫాల చరి

త్ర చాల దివ్యమైనదిగా నున్నది. వారు నిరాడంబరులుగను, స్వార్థరహితులుగను, న్యాయైక శీలురుగను రాజ్యముచేసిరి. కాని క్రమముగా వారి సామ్రాజ్యము కూడను ఖండఖండములలో వ్యాపించుకొని పోయిన తర్వాత అనేక స్థలములందు సుల్తానులు నిరంకుశులై ప్రజాభిప్రాయమును లెక్కపెట్టక రాజ్యము చేయుచు వచ్చిరి.

ఇటు తూర్పునను అటు పశ్చిమమునను మతాధికారులు పీఠాధిపతులు ఖలీఫాలు, కేవలము మతశాఖలపైననే కాక రాజులపైనను అధికారము బహుకాలమునాగించిరి హిందూస్థానములో బ్రాహ్మణ జాతికి దేవత్వము దొరికెను. షోడశసంస్కారాదికర్మలు మోపబడెను. రాజులు పురోహితుల చేతులలో బడిరి. పశ్చిమమున పోపులు (Pope) క్రైస్తవ మతాధికారత్వమును వహించి చక్రవర్తులను సహితము బహిష్కారము చేయించి గడగడ లాడించిరి. పోపులయినప్పుడు తమవి కానున్నను ఖండ ఖండాంతరములనే దానముచేసివేసిరి. స్పెయిన్, పోర్చుగల్ రాజులపై అనుగ్రహము కలిగి ఒకనాడు పోపుగారు యావత్ ప్రపంచమును తూర్పు పడమరగా రెండు భాగములుచేసి యీ యుభయ శిష్యులకు పంచి యిచ్చివేసిరి. ఖలీఫాలు మొన్న మొన్నటివరకు తుర్కీ దేశములో పీఠమువేసి కమాల్ పాషాగారు వెడల గొట్టువరకు రాజ్యాధికారమును సంపూర్ణముగా నిర్వహించుచు వచ్చిరి.

భారతదేశములో హిందువులు సమాజమును బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులని నాలుగు విభాగములుగా విభజించిరి. వృత్తులను బట్టియే యీ ప్రకారముగా విభజించినను కాలాంతరములో ఇవి కులములుగామారి జన్మస్వత్వమై పోయెను. ఈవిభజనము సార్వకాలికముగా సార్వదేశికముగా వర్తించునదియనుపూర్వుల విశ్వాసము. ఇది కేవలము హిందువులలోనే యుండెననుట పొరపాటు. అన్ని నాగరిక దేశములందును నుండెను. ప్రాచీన [illegible]యూ దేశములో పూర్తిగా ఇవే నాలుగు వర్ణములుండెను. రోము సామ్రాజ్యములో పెట్రిషియనులు (బ్రాహ్మణులు) నైటులు (knights క్షత్రి

యులు) ప్లెబియనులు (వైశ్యులు) బానిసలు (Slaves—శూద్రులు) అను చాతుర్విభాగముండెను. యూరోపులోని ఫ్రాన్సు, ఇంగ్లాండు మున్నగు దేశాలలోను మధ్యయుగ [illegible] లో ఈనాలుగు విభాగములు కొనసాగుచుండెను. (Feudal Lords, Vassals, Guilds, Serfs)

మానవసమాజచరిత్రలో సుమారు రెండువేల సంవత్సరములకాలము ఈ విభజనపై తీవ్రమైన ప్రతిఘటనలు జరుగుచువచ్చెను. రోములో బానిసలయుద్ధములు రెండు జరిగెను. ప్లెబియనులు పెట్రీషియనులపై ఎలుగెత్తి తిరుగబడి కొన్నిస్వాతంత్ర్యములు (హక్కులు) సాధించుకొనిరి. ఇంగ్లాండు ఫ్రాన్సు దేశములలో ప్రభువర్గమువారిపై (Barons) బానిసలు (Serfs) తిరుగుబాటుచేసిరి. ఆ కాలమున మతాధ్యక్షులు [illegible] వారు రాజులవంటి పూజార్హ స్థానమునాక్రమించిరి (Priest, Pope, Khalifas) ప్రభుశక్తికి ప్రత్యేక [illegible] ఘర్షణలను సాగించుచుండిరి. యూరపులో [illegible] ప్రభుశక్తియే జయించెను. [illegible] క్రీ.శ. ౧౭ ౧౮ [illegible] ౧౯ వ శతాబ్దములలో ఆర్థికవిప్లవము [illegible] (Industrial revolution) ప్రారంభమయ్యెను. సామ్రాజ్యవాదము వహించిన జాతులే (ఇంగ్లాండు ఫ్రాన్సు, జర్మనీ మొదలైనవి) ప్రపంచములో సామ్రాజ్యములు స్థాపించుకొనెను. శూద్రజాతిఅనగా కార్మికవర్గము (Labouring Classes) యొక్క విజృంభణము ౨౦ వ శతాబ్దాదినుండి ప్రారంభమైనది. రష్యాలో విజృంభించి అదియే ప్రభుత్వమును నడుపుచున్నది. ఇతర దేశములలో ఈ జాతియొక్క సామ్యవాద సిద్ధాంతము (సోషలిజం) వ్యాపించి పోవుచున్నది. ఈ విధముగా మానవులు తమ జన్మస్వత్వములకై ప్రతికాలమందును పోరాడుచు వచ్చిరి.

రాజులు దేవాంశ సంభూతులను మూఢవిశ్వాసము, రాజు సర్వతంత్రస్వతంత్రుడను సిద్ధాంతమును క్రమక్రమముగా ధ్వంసము కాజొచ్చెను. ఇతరదేశచరిత్రములకంటె ఇంగ్లాండు దేశచరిత్రయే ఇందు కనేక గుణపాఠముల నేర్పుచున్నది. ఇంగ్లాండులో క్రీ. శ. ౧౧౦౦ లో ప్రజలను సంతోషపెట్టుటకై మొదటి హెన్రిరాజు స్వయముగా స్వాతంత్ర్యముల ప్రమాణపత్రము (Charter of Liberties) ప్రసా

దించెను. దానిమూలమున తాను మతవిషయములోను జమీందా
రుల వ్యవహారములలోను ఏమియు జోక్యముకలిగించు కొనననని వా
గ్దానముచేసెను. అతనితర్వాత ౧౧౹౫ ఏండ్ల యనంతరము జాన్ రా
జు క్రీ. శ. ౧౨౧౫లో ప్రజలచే నోడింపబడి వారికి పాదాక్రాంతు
డై ఇష్టములేకున్నను ప్రజాస్వత్వప్రమాణమును (Magna Charta)
వ్రాసియిచ్చెను. తానుఇకముందు మతస్వాతంత్ర్యమును గౌరవింతునని
నియు, జమీందారులను కష్టపెట్టననియు, వారి యాలోచనాసంఘ
ముయొక్క అనుమతిలేనిది క్రొత్తపన్నుల విధించననియు, న్యాయ
ముఅందరికిసమానముగా వర్తింపజేయుదుననియు, న్యాయశాసనము
లకు విరుద్ధముగా ఏప్రజనుకూడ శిక్షింపననియు, ఒప్పుకొనెను. ప్ర
పంచమందలి స్వాతంత్ర్యసమరములలో సాధింపబడిన ప్రజాధికారము
లలో ఈ అధికారము ఒకమార్గదర్శకమైన దివ్యజ్యోతియని ఆంగ్ల
దేశచరిత్రపాఠకుల కందరకును తెలిసినవిషయమే.

ఇట్టి ఉదాహరణములింకను ఎన్నకు ఇంగ్లీషుదేశ చరిత్రయందే
లభించుచున్నవి. రెండవ జేమ్సురాజు ప్రజలకు వ్యతిరేకముగా నడు
చుకొనినందున రాజ్యమువదలి పారిపోవలసివచ్చెను. ఇది ౧౬౮౮
లోజరిగెను. ౪౦ సంవత్సరములకుముందు అనగా క్రీ. శ. ౧౬౪౯
లో దుష్పరిపాలన ఫలితముగా మొదటి ఛార్లెసురాజు తనతలనే స
మర్పించుకొనవలసివచ్చెను. నిరంకుశుడగు ఈ మొదటి చార్లెసును
ప్రతిఘటించిన సాధారణజనులైన హాంప్డన్ అనునతడును పిం అను న
తడును ధైర్యముతో ప్రతిఘటించినందున చరిత్ర ప్రసిద్ధపురు
షులైరి.

అమెరికాదేశము మొదట ఇంగ్లీషువారి అధీనములో నుండె
ను. అమెరికావారు ఇంగ్లాండులోని పార్లమెంటులో తమప్రతినిధు
లుండవలెనని కోరిరి. ఇంగ్లీషువారు నిరాకరించిరి. అప్పుడు అమెరి
కాలో ఒకముఖ్యసిద్ధాంతము బయలుదేరెను. "ప్రాతినిధ్యము లేకు
న్న పన్నులిచ్చుటయులేదు" (No taxation without representa-
tion) తదనుసారముగా వారుతిరుగబడి యుద్ధములుచేసి ఇంగ్లీషుసై

న్యముల నోడించిరి. క్రీ. శ. ౪ జూలై ౧౭౭౬ నాడు అమెరికావారు తమ స్వాతంత్ర్యమును ప్రపంచమునకు ప్రకటించిరి. ఇంగ్లాండులో ౧౬౮౯ వ సంవత్సరమెట్లు ప్రథమజ్యోతిస్థానమో ఈ ౧౭౭౬వ సంవత్సరము ప్రపంచచరిత్రలో ద్వితీయజ్యోతిస్థానముగా నున్నది.

ఫ్రాన్సు దేశచరిత్రయు మనకనేక గుణపాఠముల నేర్పినది. బోర్బన్ రాజులు సర్వదా నిరంకుశులైయుండిరి. ప్రతిదానికిని పరిమితి యుండును. ప్రజల సహనమునకు మితియుండును. అది మీలులేనంతటి పరిస్థితి యేర్పడెను. క్రీ. శ. ౧౭౮౯ లో ఫ్రెంచివారు తమరాజులపై తిరుగుబాటుచేసి వారిని దేశమునుండి వెడలగొట్టి బాస్టీల్ అను రాజకీయఖైదీల కారాగారమును ధ్వంసముచేసి బంధితులనందరిని విముక్తులుగాజేసి ప్రపంచమునకు వారొక నూత్న సిద్ధాంతమును బోధించిరి. అదేమన సర్వప్రజలును (రాజులుకానీ రాతులుకానీ రైతులుకానీ) "సమానులే," "స్వతంత్రులే" అన్నదమ్ములే" (Liberty Equality and fraternity) ఈ ౧౭౮౯ వ సంవత్సరము మూడవ జ్యోతిస్థానము.

రష్యాదేశము ప్రపంచరాజ్యములలో నెల్ల వైశాల్యమునుబట్టి అగ్రస్థానము వహించునట్టిది. అనాదినుండియు నిన్నమొన్నటివరకు ఆదేశములో "జార్" చక్రవర్తుల దౌష్ట్య దౌర్జన్యపద్ధతులు అనంతములును అఖండములునునై యుండెను. నోరు తెరచినవారినెల్ల తలగొట్టించుటయో, జేళ్లలో మూసియుంచుటయో లేక సైబీరియాయను దూరప్రాంతమందలి నిరంతర హిమప్రదేశములో ఘోరమరణమొందుటకు స్థానభ్రష్టత కలిగించుటయో, కావించుచుండిరి. ఇట్లుండ ౧౯౧౭ వ సంవత్సరములో జనులుతిరుగబడి రాచపురుగు గూడ ఉండని ముందేశము కోరలుచాచునోయని, రాజును రాజవంశాంకురము లేనట్లుగా శత్రువులకు బలియిచ్చి ప్రజాసామ్యవాదమును ప్రపంచమునకు ప్రకటించిరి. ఇదినాల్గవ ఘట్టము.

క్రీ. శ. ౧౯౧౪ వ సంవత్సరములో ప్రారంభమై ౧౯౧౮ లో ముగిసిన యూరోపు యుద్ధమొక విచిత్ర ఘట్టము.

యుద్ధము జరిగినన్ని దినములు ఇంగ్లీషువారును వారిపక్షమువారును ప్రపంచనాగరికత సంరక్షణార్థమును, ప్రపంచమందలి సర్వసంఘములకును దేశములకును సర్వవిషయములలో స్వయంనిర్ణయాధికారము (right of self determination)ను స్థాపించుటకు యుద్ధముచేయుచున్నామని నిరంతరము ప్రకటించుచువచ్చిరి. యుద్ధానంతరము ఇండియాకు రౌలెట్ శాసనములు, జాలియన్ వాలా బాగులు ప్రసాదింపబడెను. అంతర్జాతీయసంఘము (League of nations) విల్సన్ గారి మొదటి ౧౪ సూత్రాలు తుడిచివేసి క్రొత్త ౧౪ సూత్రాలతో స్థాపితమయ్యెను. దాని పరిణామమేమనగా ఈ యంతర్జాతీయసంఘము ఒకటిరెండు సామ్రాజ్యములయొక్క అనుకూలాలలోని సంఘముగా మారెను. ఈ యూరోపుయుద్ధము వట్టిబూటకమనియు, సంపూర్ణస్వార్థతతో కూడినదనియు, ప్రపంచమునకు వెల్లడియయ్యెను. ప్రపంచచరిత్రలో లోకమునకు నష్టదాయకమైన మహాయుద్ధములలో ఇది అగ్రతాంబూలమును పొందినది.

ప్రపంచమంతటను రాచరికముపైవ్యామోహమంతరించినది. బహుదేశములలో ప్రజాపరిపాలనమే బహుళమైపోయినది. యూరోపుఖండములో ఇంగ్లాండు, ఇటలీ, బెల్జియం, గ్రీసు, రొమేనియా మరి ఒకటిరెండు చిల్లరచిన్న రాజ్యములలో తప్ప తక్కిన దేశములందంతటను ప్రజాపరిపాలనమే స్థాపింపబడినది. ఇంగ్లాండులో సహితము రాజునిరంకుశత్వమెన్నడును వహింపజాలనివానినిగా జేసివేసినారు. ప్రజాప్రతినిధులతో గూడిన పార్లమెంటు సర్వమునకు స్వతంత్రాధికారి. రాజుఆపార్లమెంటు శాసనముల ప్రకారము వర్తించుకొని తీరవలెను. అందుచేతనే ఇంగ్లీషురాజును శాసనబద్ధప్రభువు (Constitutional monarch) అని యందురు. మరియు ఫ్రాన్సు, అమెరికా, రష్యాదేశములవలె ఇంగ్లాండుకూడ రెండుముఖ్య రాజకీయ సిద్ధాంతములను ప్రపంచమునకు ప్రసాదించినది. అవేమనగా "రాజు (అనగ శాసనబద్ధుడగు రాజు) తప్పుచేయనేరడు" (The King can do no wrong) అనునదొకటి. రెండవదేమన,

(The King is dead, long live the King) "రాజు చనిపోయినను రాజు శాశ్వతముగా జీవించుగాక". ఎందరు రాజులు చనిపోయినను, ప్రభుత్వస్వరూప మెట్లు మారినను రాజ్యము (State) మాత్రము స్థిరముగానుండును అనియే దీనియంతరార్థము. అమెరికా ఖండములో అమెరికా సంయుక్తరాష్ట్రము (U. S. A) కనడా మున్నగు దేశములలో ప్రజాపరిపాలనమే కలదు. ఆస్ట్రేలియాలోను ఆఫ్రికాలోని కొన్ని వలస రాజ్యములలోను అట్టిప్రభుత్వమే కలదు. ఇక మిగిలినది ఏషియాఖండ మొకటే, అందు చీనాలో చక్రవర్తి మాయమయ్యెను. ఇండియా పరాధీనములోనున్నది. పర్షియా, ఈరాను, అరేబియా వంటి దేశములలో తీవ్రమగు మార్పులు జరుగుచున్నవి. ప్రపంచమందు ప్రభువుల నిరంకుశత్వమునకు ప్రజాస్వాతంత్ర్యకాంక్షకును జరిగిన సంఘర్షణలోని ముఖ్యఘట్టము లింతవరకు దిగ్దర్శనమాత్రముగా చూపింపబడినవి.

మానవుని వ్యక్తిస్వాతంత్ర్యమునకై, నిర్భయభావప్రకటనమునకై ఎందరో మహాత్ములు తమధనమును, తమస్వేచ్ఛను, తమ ఆలుబిడ్డలను, తుదకు తమప్రాణములను సమర్పించిరి. లోకసంగ్రహార్థము కొందరుమహాపురుషులు తమసర్వస్వమును బలియిచ్చి లక్షలకొలది, కోట్లకొలది జనుల సౌఖ్యమును పెంపొందించుటలో తోడ్పడినారు. పాశ్చాత్య దేశములలోనేమి, ప్రాచ్య దేశములలోనేమి మతము పేరట, ఎన్నియో ఘోర దుర్భరదురంతములు కావింపబడెను. అట్టి మతోన్మాదుల పైశాచికకృత్యములకు బలియైనవారు కోట్లకొలదిగా నుండిరి. మరియు రాజకీయ స్వాతంత్ర్యమునకై, సత్య సందేశములకై ఎందరో ప్రాణములర్పించిరి. ౨౩౦౦ ఏండ్లక్రిందట గ్రీసులో సాక్రటీసు అను మహర్షి బోధలకు తట్టుకొనజాలక అప్పటి ప్రభుత్వమువారు అతనిచంపివేసిరి. ఆదిలో క్రైస్తవుల నెందరినో సింహములకాహారముగా బోనులలో వేసిరి. గాలిలియోను క్రొత్తసిద్ధాంతములను లేవదీసినందులకు జెయిలులో వేసిరి. బ్రూనోను స్వేచ్ఛావాదమును చేసినందులకు హింసించిరి. మనుష్య

రు "నేనే దేవుడను" అనినందులకు తిత్తి ఒలిపించిరి. బన్యాన్ సాత్వి కబోధలు చేసినందున జెయిలులో మూయబడెను. మ్యాజ్జినీ దేశభ్రష్టుడయ్యెను. లెనిన్ ఘోరకష్టములనుభవించెను. ఫ్రాన్సులో వాల్టేరు, రూసోయనువారు స్వాతంత్ర్యసిద్ధాంతములు చెరిగిపోసిరి. థామస్ పెయిన్ యొక్క "మానవుల స్వత్వములు" అను ప్రచండగ్రంథము మ్యాజ్జినీయొక్క "మానవుని విధులు" అను గ్రంథమున్ను యూరోపు దేశములో గొప్పసంచలనము కలిగించెను.

దేశస్వాతంత్ర్యమునకై తమఖడ్గము నుపయోగించిన ఇటలీ దేశపు గ్యారిబాల్డియును, అమెరికా దేశపు వాషింగ్టన్నును దేశారాధకుల కందరకును వంద్యులైరి. రష్యాదేశములోని సామ్యవాద సిద్ధాంతమునకు మాక్జింగోర్కీయున్ను లియోటాల్స్టాయి యున్ను, ట్రాట్స్కీయున్ను లెనిన్ యున్ను మార్గదర్శకులైరి. చీనా దేశములో నూతన విజృంభణమునకు సన్ యెట్ సన్ గారు కారకులైరి. ౭౦౦ సంవత్సరములనుండి నానావిధముల ఇంగ్లీషు వారిచే అణచివేయబడిన ఐరిషుస్వాతంత్రమున్ను ఐరిషు భాషయున్ను, ఐరిషు సంస్కృతియున్ను విజృంభించి, పరిణతిబొంది విజయమొందుటకు ముఖ్యకారకులు మ్యాక్ స్వీనీ, డీవెలరా, అనుమహానుభావులు. అనేక శతాబ్దములనుండి "యూరోపుఖండపురోగి" (Sick man of Europe) అను నప్రతిష్ఠకు పాల్పడిన తుర్కీ దేశము ముస్తఫా కమాల్ పాషా యనువారి నాయకత్వములో అకాండముగా చెలరేగి మతరాజకీయ సాంఘికసారస్వతములందు సంపూర్ణస్వాతంత్ర్యమునుపొంది తేజోవంతమై ప్రపంచమందలి రాజ్యములలో గణనీయమైనదగుచున్నది. ప్రపంచజాతులన్నింటిలో దిక్కులేని నీగ్రోజాతి బానిసజాతియైయుండ అట్టిదానిలోసహితము బూకర్ వాషింగ్టన్ అను మహాపురుషు డుద్భవించి యీజాతినుద్ధరించినది, చాలమంది విజ్ఞానవంతులే యింకను గుర్తించినవారుకారు. భారతదేశమందు తిలకు, లజపతిరాయి, నెహ్రూ, మహాత్మాగాంధీవంటి వారెందరో దేశ స్వాతంత్ర్యదేవతకై తమసర్వస్వము నర్పించినారు. అం

దు మహాత్మాగాంధీగారు లోకోత్తర పురుషుడు ("పురుషోత్తముడు") అని. హేయిన్సుహోమ్సుచేతను, రోమేఁరోలండుచేతను మరి వేలకొలది ప్రపంచమహాపురుషులచేతను కొనియాడబడుచున్నాడు.

ఇదిమానవుని స్వాతంత్ర్యసమర సింహావలోకనచర్చ.

ప్రాథమిక స్వత్వములు

# స్వాతంత్ర్యలక్షణములు

భావనా బలము సర్వవిషయములలో బలియమైన శక్తి. ప్రపంచములో జనులు భావములకు భయపడినట్లు మరి దేనికిని భయపడరు. "నేను నీయభిప్రాయములన్నింటితోను భిన్నించుచున్నాను. కాని నీయభిప్రాయములెట్లున్నను వాటినిప్రకటించు నీ స్వాతంత్ర్యమును నేను నాప్రాణము లొడ్డియైనను స్థాపింతును." అని ఒక పాశ్చాత్య పండితుడు సెలవిచ్చెను. పురుషుడుగాని స్త్రీగాని తమ భావనాబలముచేతనే ప్రపంచములో అభివృద్ధికి కారకులైనారు. ఎందెందు భావనిరోధము కలిగినదో అచ్చట తీవ్ర సంచలనము కలుగుచువచ్చినది. భావస్వాతంత్ర్యము అన్ని స్వాతంత్ర్యములలో ముఖ్యమైనది. స్వాతంత్ర్యము లనేక విధములుగా నున్నవి. అవేవనగా:—

| | | |
|---|---|---|
| ౧. | భావస్వాతంత్ర్యము | Liberty of thought |
| ౨. | సమావేశ ,, | ,, Assembly |
| ౩. | ఆత్మ ,, | ,, Person |
| ౪. | మత ,, | ,, Religion |
| ౫. | రచనా ,, | ,, Press |
| ౬. | వాక్ ,, | ,, Speech |

ఇవిముఖ్యమైన విభాగములు. కొందరి రాజకీయవేత్తల యభిప్రాయములో మరికొన్ని యున్నవి. జీవన స్వాతంత్ర్యము (Liberty of life), ఆస్తిస్వాతంత్ర్యము (Right of Property), ఆయుధములను పట్టుఅధికారము(Liberty to bear arms),న్యాయ

సామ్యత(right of judicial trial and equal justice) ఊరేగింపులస్వేచ్ఛ (right of processions) నివాసస్వేచ్ఛ ( Liberty of dwelling) అనునవికూడ కలవందురు. కాని ఇవన్నియు పై ఆరువిభాగములలోనిఅంగములుగానే భావింపవచ్చును. అందుచేత వీటిని గురించిన ప్రత్యేక చర్చ అనవసరము.

పై విభాగములను గురించి వివరించుటకు పూర్వము వాటిని స్థాపించుకొను నవసరమేలనో విచారింతము. సాధారణముగా అధికారమందుండువారు తమ అధికారమును పోగొట్టుకొననొల్లరు. గానిని స్థాపించుకొనుటలో ఇతరులు చేయువిమర్శనలను సహింపరు. అందుచేత విమర్శకులను సర్వవిధముల కష్టపెట్టుటకై ప్రయత్నించుచుందురు. అట్లుచేయుటలో వారు నానాసాధనముల నవలంబింతురు. నిర్భయముగా మాట్లాడుటను నిరోధించుటకై రాజద్రోహ శాసనముల (Sedition laws) చేసినారు మరియు ప్రచారము చేయకుండుటకై పత్రికలపైనిరోధముల ( Censorship ) నేర్పాటు చేసినారు. పుస్తకములలో తమకు నచ్చని విషయములుండిన ఆపుస్తకములను జప్తిచేయుటయో లేక ఎవ్వరును చదువకూడదని ఆజ్ఞాపించుటయో లేక తమదేశము హద్దులలోనికి రాగూడదని శాసించుటయో జరుగును. టప్పా వ్యవహారములపైనను ఒకకన్ను ఉంచుదురు. అనుమానగ్రస్తములగు జాబులను వస్తువులను తెరచి చూచుచుందురు. సభలపై వివిధములగు నిరోధకము లుంతురు. ఊరేగింపులను చేయనీయరు. తమకునచ్చనివారిని వెంబడించి వారిదినచర్య లన్నింటిని తమకుతెలుపుచుండుటకై చారులను (ఖుఫ్యా— సి. ఐ. డీ) నియోగింతురు. ఈ చారులు నానారూపములతో వారివెంటబడి వారిరహస్యముల నన్నింటిని తెలుసుకొనుచుందురు. అనుమానగ్రస్తులను అధికారవర్గము వారు ఏదో విధమున జెయిళ్ళలోగాని ప్రత్యేకస్థలములలోగాని మూసియుంచుదురు. న్యాయస్థానములలో విచారణకూడ చేయనొల్లరు. (Detention without trial) లేదా తమదేశము హద్దులలోనికి

రానీయరు. తమదేశములోనేయుండి తమకు విరోధముగా వర్తించినవారిని దేశమునుండి వెడలగొట్టుదురు (షేర్ బదర్-Banishment) వారియిండ్లను శోధించి ప్రమాదకరములగు ఆయుధములున్నవా? బాంబులున్నవా? తప్పుడు గ్రంథములున్నవా? ఏదైన రహస్యసంఘముయొక్క జాడలున్నవా? నిషేధించిన వస్తువులున్నవా? అను విషయములను పరికింతురు. ప్రత్యేకపరిస్థితులనుబట్టి జనులభావములను నిరోధించుటకై అవసరములగు ప్రత్యేకశాసనములను, ఆర్డినెన్సులను, కావింతురు. కొన్ని దేశములలో నిరంకుశులైన నియంతలు అన్నింటికన్న సులభమార్గమును కనిపెట్టినారు. అది తమకెదురు తిరిగినవారి నందరిని తలకొట్టించుటయే!

పూర్వకాలములో నిరోధములు మూడే మార్గములలో నడుచుచుండెను. సరిపడనివారినందరిని దేశమునుండి వెడలగొట్టుట, లేక కారాగారములో బంధించుట లేక తలనరికించుట, ఇప్పుడు కాలముమారినది. నాగరికకాలములో నాగరిక పద్ధతులుకూడ కలవు. అవిశ్వాసములద్వారా పనితీసికొనుట. అవన్నియువ్యర్థమైన నాడు ప్రమాదింటిలో ఏదైననొకటి యవలంబింతురు. ఇందుచేత ప్రపంచమందలి ప్రతినాగరిక దేశములోను, జనులు పై యష్టకష్టములను విరివిగా అనుభవించి తుదకు తమ తమ దేశము యొక్క రాజ్యాంగశాసనములో (Constitutional act) వివిధ స్వాతంత్ర్యముల సంబంధమగునియమములను ప్రత్యేకముగానేర్పాటుచేయించినారు. ఇక పైన సూచించిన ఆరువిధముల స్వాతంత్ర్యము లెట్టివో కనుగొందము.

### ౧. భావస్వాతంత్ర్యము.

ప్రపంచములో ఉత్తమాలోచనలతో కూడినవారు చాల అరుదు. అట్టి యుత్తమాలోచనలను ప్రకటించు ధైర్యము కలవారింకను అరుదు. భావములు మంచివిగను చెడ్డవిగనుండును.

ఒకకాలములో చెడ్డవని తలచబడిన భావములు ఇంకొకకాలములో పూజ్యములగును. ప్రతి సమాజములోను కొన్ని ఆచారములు స్థిర పడియుండును. అవి దుర్వినియోగముచేతను కాలాంతరమున పనికి రాక నష్టదాయకము లగుటచేతను కొందరుపండితులు బయలుదేరి సంస్కారముచేయ యత్నింతురు. సహజముగా సంఘములో పలువురు ప్రతిఘటింతురు. అదేవిధముగా అధికారమందున్నవారు ను తమ అధికారమును తగ్గించునట్టి అభిప్రాయములను అణచివేయ జూచుచుందురు. ఉత్తమమైనభావములు తాత్కాలికముగా అణచి వేయబడినను అవి ద్విగుణీకృత శక్తితో విజృంభించుచుండును. భావ ములకును హద్దులుండును. సహజముగ సంఘమును నీతి బాహ్య మైనట్టియు, అసత్యమైనట్టియు మార్గములలో నడుపునట్టిభావములు నిరోధింపబడినదానికెవ్వరును ఆక్షేపించరు. కాని సద్భావములకు ప్రతినాగరిక ప్రభుత్వముకూడ అవకాశమిచ్చుట న్యాయము.

ప్రతివ్యక్తియు తనమనస్సుపై, తనశరీరముపై తన ఆస్తిపై సంపూర్ణాధికారముకలవాడు. ప్రతివ్యక్తియు తనభావములను నితరులలో వ్యాపింపజేయునప్పుడు అవిమంచివా చెడ్డవా అనువిషయ మును నిష్పాక్షికబుద్ధితో విమర్శింపవలసియుండును. తమకు సరిపడ నంతమాత్రమున నే అణచివేయుట చాలఅన్యాయమనిపించుకొనును. ప్రభుత్వము ప్రజలమనస్సులలోని భావములనన్నటికి అణచి వేయ జాలదు. ప్రజలశరీరములపై శాసించవచ్చునేకాని భావముల శాసించుట బ్రహ్మచేతను కానట్టి పని.

## ౨. సమావేశ స్వాతంత్ర్యము.

మానవులు తమ అభ్యుదయముకొరకు సంఘీభావమును కలిగియుండుట యవసరము. తమ భావములను జనులలో వ్యాపింప జేసి సమాజోన్నతికి పాటుబడుటకు ముఖ్యసాధనముసమావేశమే. ప్రజలు సభలు చేసికొనుటకును సమాజములు, సమితులు స్థాపించు కొనుటకును, తమ యుద్దేశములను వ్యక్తపరచుటకై అవసరమగు నప్పుడు ఉత్సవములు, ఊరేగింపులు చేసికొనుటకు సంపూర్ణమగు

అధికారము కలవారుగా నుండవలెను. ప్రతివస్తువునకును హద్దులుండినట్లు వీటికిని న్యాయమగు హద్దులుకూడవని యెప్పుడును చెప్పజాలము. ఇతరులను హింసించుటకును, దౌర్జన్యములు సాగించుటకును, నీతిబాహ్యమగు కార్యములు చేయుటకు, సమావేశములును, సభలు చేసినట్లయిన అవి తప్పక అణచివేయవలసినవే. కాని ప్రజల యిబ్బందులను, వారి ఆశయములను, అధికారమందుండువారి దౌర్జన్య నిరసనములను, ప్రకటించుటకై చేయబడు సభలపై ఆంక్షలుపెట్టుట స్వాతంత్ర్యభంగిములో చేరినట్టిదగును. అధికారమందుండువారు ముందు ముందుగానే సభలనాపివేయుట లేక కానీయకపోవుట దౌర్జన్యమనిపించుకొనును. సభలు జరుగనిచ్చి అందు న్యాయవిరుద్ధమైన చర్చలు జరిగిన లేక దౌర్జన్య పరిణామము వహించిన అప్పుడు సమావేశకారకులను న్యాయశాసనముల ప్రకారము శిక్షించుట సరియగుపద్ధతి.

### 3. ఆత్మస్వాతంత్ర్యము.

ఏవ్యక్తినిగాని సరియగు కారణము చూపించక ప్రభుత్వమువారు నిర్బంధింప కుండుటయే ఆత్మస్వాతంత్ర్య మనిపించుకొనును. ఎవరైనను యెంతగొప్పనేరము చేసినను వారిని న్యాయస్థానమున విచారించి వారి దోషములను నిరూపించిశిక్షించుట సరియగుపద్ధతి. ప్రజలలో ఎట్టి నీచాతినీచునైనను, ఎట్టి దరిద్రునైననుసరే దేశమందువర్తించు శాసనములకు వ్యతిరేకముగా, నిరోధించుట లేక పట్టుకొనుట, లేక జయిలులోనుంచుట, లేక దేశమునుండి వెడలగొట్టుట లేక దేశములోనికి రానీయకుండుట, లేక ఏవిధమైన కష్టములపాలు చేయుట, ఇవన్నియు వ్యక్తిస్వాతంత్ర్యభంగము కలిగించునవై యుండును. ఒకవేళ ఒక వ్యక్తికి ప్రభుత్వముకాని, దానిని నడుపు అధికారులుగాని, పోలీసువారుకాని, లేక ప్రభుత్వానుమతి పొందిన ఎవరైనకాని, న్యాయవిరుద్ధముగా ఏవిధముల కష్టపెట్టిన అట్టి వ్యక్తికి తనను కష్టపెట్టువారిపై న్యాయస్థానములందు అభియోగము తెచ్చి నష్టపరిహారముపొందు అధికారముకూడ నుండవలెను. ఇప్పుడు ప్రతి

నాగరిక దేశమందు ఉన్నత న్యాయస్థానములకు వ్యక్తిస్వాతంత్ర్య రక్షణాధికారమును ఇచ్చియున్నారు. (దీనినే ఇంగ్లీషులో Writ of Habeas Corpus అందురు) అనగా ఏవ్యక్తినైనను ఎవరైననుసరే పట్టుకొని నిరోధించి లేక దాచియుంచిన ఆ నిరోధింపబడిన వ్యక్తి బంధువులేకాక సంబంధములేనట్టి యెవ్వరైననుసరే ఉన్నత న్యాయ స్థానములో మొరపెట్టుకొని వానిని న్యాయస్థానమునకు పిలిపించి విచారించునట్లు ఆజ్ఞలను జారీచేయింపవచ్చును. హేబియస్ కార్పస్ అనగా "వ్యక్తినిగాని వాని శరీరమునుగాని చూపింపుము" అనియ ర్థము. ఈ అధికారము న్యాయస్థానముల కియ్యబడినది. ప్రభుత్వము యొక్క కార్యనిర్వాహక వర్గమువారు (Executive) నిరంకుశము గా, సరిపడని వ్యక్తుల న్యాయస్థానమందు విచారించి నేరము స్థిర పరుచక వారిని దాచియుంచిన, లేక నిరోధించి యుంచిన, లేక జయి లులో వేసియుంచిన ఆవ్యక్తికి సంబంధించినవారు కాని, సంబంధించని వారుకాని ఎవ్వరైనను సరే న్యాయస్థానములో తెలిపి హేబియస్ కార్పసు ఆజ్ఞను పొందవచ్చును. ప్రభుత్వ కార్యనిర్వాహక శాఖపై ననేకాక యేవ్యక్తి చేతనయినను నిరోధము కలిగినవానిపైనను ఈ ఆజ్ఞను పొందుటకు ప్రజలకు అధికారము కలదు.

ఆత్మస్వాతంత్ర్యములోనే జీవిత స్వాతంత్ర్యము చేరి యున్నది. ఒకనిని ఇంకొకడు చంపవచ్చినపుడు ఎదిటివానినిచంపియైన నను ఆత్మ రక్షణము చేసికొను అధికారము సర్వదేశములందును కలదు. హిందుస్థానపు శిక్షాస్మృతి (పీనల్ కోడు) లోను కలదు. ఒకని చంపినవానికి న్యాయస్థానమువారు ఉరితీయుదురు. ఎవడైన ఆత్మహత్య చేసికొనినచో ఇక దానికి శిక్షయేలేదు. కాని ఆత్మహత్యలో విజయము పొందనివానికిమాత్రము శిక్షకలదు. స్త్రీలకు మానము ప్రాణముకన్న విలువకలది. మానభంగ మొన రించు వానినుండి రక్షించుకొనుట సర్వవిధముల స్త్రీలకు సంపూర్ణా ధికారముగలదు. ప్రతిదేశములోను రహస్యసంఘములు దోపిడీలకు గాని, రాజద్రోహములకుగాని, సంఘవిప్లవములకొరకుగాని, స్త్రీజనా

పహారణమునకుగాని యేర్పడియుండును. అమెరికాలో "క్లూక్లక్సుక్లాన్" అను రహస్యసంఘము విశేషముగా నీగ్రోలను హింసించుట కేర్పడినది. ఇండియాలో "గుండాలు" మతకలహములకును, స్త్రీలనపహరించుటకును ఏర్పడినారు. ఇట్టి దుర్మార్గసంఘములను అణచివేసి ధ్వంసముచేయుట ప్రభుత్వ విధులలో ముఖ్యమైనవిధి. జనులకు ప్రాణముల తర్వాత ద్రవ్యముపై, ఆస్తులపై ప్రీతిమెండు. లోభులకు ఆస్తులు ప్రాణములకన్న ఎక్కువ విలువగలవి. ఆస్తుల సంరక్షణము కూడ ఆత్మస్వాతంత్ర్యములలో నొక ముఖ్యాంగము. ప్రభుత్వము వారు ద్రవ్యవంతులనుండి ఆదాయముపన్ను మున్నగునవి తీసికొనుటలోని యర్థమిదియే. ఆస్తుల రక్షించినందులకు వారికి పన్నువిధించు అధికారము కలుగుచున్నది.

## ౮. మతస్వాతంత్ర్యము.

ప్రపంచములో మతము పేరిట జరిగిన యుద్ధములు, కావింపబడిన ఘోరములు, అత్యాచారములు, మరేవిషయమునను జరుగలేదని చెప్పవచ్చును. ఒక మతము వారు ఇంకొక మతమువారిని ధ్వంసముచేయుటలోను, ఘోరహింసలుచేయుటలోను ఏమాత్రమును వెనుదీయలేదు. ఒక మతములో భిన్నశాఖ లేర్పడినపుడు ఏశాఖ వారు ప్రబలులైరో వారు నిర్బలులైన శాఖవారిని హింసించిరి. క్రైస్తవులలో క్యాథలిక్కులనియు, ప్రొటెస్టెంటులనియు రెండుశాఖ లేర్పడి కొన్ని శతాబ్దములపర్యంతము ఒకశాఖవా రింకొకశాఖవారిని నాశనము చేయుచువచ్చిరి. హిందువులలో కులభేదములేర్పడి పరస్పర హింస నేటికిని జరుగుచున్నది. ముసల్మానుల యొత్తిడికి తట్టుకొనజాలక అనేకపార్సీలు హిందూదేశమును శరణుజొచ్చిరి. హిందూ ముసల్మానుల పోరాటములు చరిత్ర ప్రసిద్ధములేకాక ఈనాడును భారతీయులకు లజ్జాకరమగు కళంకమునుకలిగించినవి. ఆస్తికులు, నాస్తికులపై యుద్ధధ్వజమెత్తిరి. యహూదులను ప్రాచీనకాలమునుండియు నేటివరకు సర్వదేశములలో కష్టపెట్టుచువచ్చిరి.

ఆధునిక కాలములో నాగరిక రాజ్యాలలో మతసహనము క్రమక్రమముగా స్థిరపడి పోవుచున్నది. ఎవరికభిమతమగు మతమును వారు స్వీకరించుటకు ఎవ్వారికిష్టమగు విధమున వారు ప్రార్థనలుచేసికొనుటకును అధికారము క్రమముగా స్థాపించబడుచున్నది. ప్రభుత్వమునడుపువారే మతమునకు చేరినను, వారు తమదేశమందలి సర్వమతములను సమానదృష్టితో చూచుటయే ఉత్తమలక్షణమని స్థిరపడుచున్నది. అట్లుచేయక మతపక్షపాతముచూపు ప్రభుత్వము నింద్యమై అపకీర్తికి పాల్పడుచున్నది.

## ౫. రచనా స్వాతంత్ర్యము

రచనా స్వాతంత్ర్యములో గ్రంథములనువ్రాసి ప్రకటించు హక్కును వ్యాసములువ్రాయు అధికారమును,పత్రికలను స్వేచ్ఛగా నడుపు అధికారమును చేరియున్నవి. ఒక వంద సంవత్సరములనుండి పత్రికా నిర్వాహణపద్ధతి వృద్ధియగుచు నేడది ఒక అద్వితీయ సంస్థయైపోయినది. పత్రికలు తురీయశక్తి (Fourth Estate)అని పేరు గాంచినవి. ప్రజలలో తీవ్రమైనమార్పులు కలిగించుశక్తి ఒక్క పత్రికలకేకలదు. అందుచేత నానా ప్రాంతములందు పత్రికలపై ప్రభుత్వ వర్గమువారు వివిధములగు నిరోధములను మోపెట్టుచు వచ్చినారు. ఇదిచాల దౌర్జన్యపద్ధతి. పత్రికలకు సంపూర్ణ స్వాతంత్ర్యముండవలెనని విజ్ఞానవంతులందరును కోరుదురు. పత్రికలు హద్దులుమీరినట్లైన వాటిని నవుడు వారిని దేశమందలి శిక్షాస్మృతిలోని మానభంగముయొక్కయు, రాజద్రోహముయొక్కయు, శాంతిభంగముయొక్కయుసూత్రముల ప్రకారము విచారించిశిక్షింపవలెను. కాని ముందుముందే వాటిని అణచివేయుటకాని, లేనిపోని షరతుల విధించుటకాని, లేక పత్రికలకుసెలవే యియ్యకపోవుటకాని, లేక న్యాయస్థానమున విచారించకయే కార్యనిర్వాహక వర్గమే జోక్యము కలిగించికొని, దోషములుకల్పించి ఆపివేయుటకాని, పూర్ణముగా నిరంకుశమనిపించుకొనును. "పత్రికల స్వాతంత్ర్యమనగా ఎవరి సెలవును (లైసెన్సు)లేక ముద్రించు అధికారముకలిగి దేశమందలి

సాధారణ శిక్షాస్మృతికి మాత్రమే అధీనమైయుండుటయైయున్న దిʼʼఅని లార్డు మార్కస్ట్రీల్డుగారు సెలవిచ్చిరి.

## ౬. వాక్స్వాతంత్ర్యము

ఒకనికి ఉత్తములని తోచిన భావములను సభలలో చెప్పుటకు సంపూర్ణముగా అధికారముండవలెను. ఆభావములు ఇతరులను హింసచేయుటను ప్రేరేపించునవిగా నుండకుండునట్లును, నీతిబాహ్యమైనవిగా నుండకుండునట్లును, చూడవలెను. ఈహద్దులలోనుండి జనులకు మాట్లాడుటకు స్వాతంత్ర్యముండవలెను. ఒకడు మాట్లాడక ముందే వాడు సరిపడనిసంగతులు మాట్లాడునేమోయని వాని నోరుమూయుట, లేక ఒకసంఘమునే ఈ యా విషయములను గురించి మాట్లాడనేకూడదు అని ముందుముందుగానే నిర్బంధించుట నాగరిక రాజ్యములలో ఇప్పుడు జరుగుటలేదు. తన వాక్స్వాతంత్ర్యము దుర్వినియోగము చేసినవానిని న్యాయస్థానములో విచారించి నేరము స్థిరపడినవనే శిక్షించవలెను.

జనులకు మాట్లాడుటకు ఎట్లు అధికారమున్నదో అదే విధముగా సభలుచేయుటకును సంఘములు స్థాపించుకొనుటకును, సంఘీభావమును సమకూర్చుకొనుటకును, సక్రమ న్యాయపద్ధతులపై ఆందోళనము చేయుటకును, బహుసంఖ్యాకులకు నష్టదాయకమగు శాసనములలో మార్పులు కలిగించుటకై న్యాయబద్ధమగు ప్రయత్నములు చేయుటకును అధికారముకలదు.

ఇవి ఆధునిక కాలములో ఉత్తమ ప్రభుత్వములందల్లడలను జనులు పోరాడి, సాధించి, శాసన రూపముగా స్థిరపరచుకొనిన ప్రాథమిక స్వత్వముల ముఖ్యాంగములు.

# కొన్ని ఆదర్శ దేశములలోని విధానము

## 3

మానవుని ప్రాథమిక స్వత్వములను గురించి తెలిసికొనుటకై మనకు ఇంగ్లాండు, ఫ్రాన్సు, అమెరికా దేశములు ముఖ్యముగా ఆదర్శములై యున్నవి. స్విట్జర్లాండు అను చిన్న రాష్ట్రముకూడ మార్గదర్శకమైనది. రష్యా రాజ్యాంగములో సహితము లెనిన్ ప్రభుత్వకాలములో ప్రచండముగ మాన్యులు గలిగి ప్రజలందరియొక్క స్వత్వము లంగీకరింపబడెను. అయితే యీ సందర్భములో కొందరు జర్మనీ, ఇటలీ, జపాను దేశములనేల ఆదర్శముగా తీసికొనకూడదని ప్రశ్నింపవచ్చును. జర్మనీ, ఇటలీ దేశములు నిరంకుశ నియంతల ఆధీనములోనున్నవి. నియంతృత్వము ఎంత లాభకారియైనను ప్రజాపరిపాలనతో తుల్యము కాజాలదు. నియంతకు తనకేది బాగనితోచిన దానిని ఆజ్ఞాపించి ప్రజల కిష్టమున్నను లేకపోయినను సాధించితీరును. నియంతృత్వము మధ్యవచ్చిన అవాంతరముగా నెంచవలెను. చరిత్ర పఠనమువలన నియంతృత్వము స్థిరకాల ముండునది కాదని బోధపడును. మరియు జపాను దేశము నిరంకుశ పరిపాలకుని వశమందున్నది. కావున స్థిరముగా ప్రజానురంజకముగానుండు దేశములనే మనము ఆదర్శముగా తీసికొనవలెను.

"ఉత్తమ ప్రభుత్వము ప్రజలచే నడుపబడినదై ప్రజలదే అయినట్టిదై ప్రజలకొరకే పనిచేయునట్టిదయి యుండవలెను" ( Government of the people, by the people, and for the people.) అను సుప్రసిద్ధ సిద్ధాంతమునుబట్టియే మనము పరీక్షింపవలెను. ఇక ఫ్రాన్సు, అమెరికా, ఇంగ్లాండు, స్విట్జర్లాండు, రష్యా దేశములలో ప్రజాస్వత్వములెట్లు వర్తించుచున్నవో గమనింతము.

## ఫ్రాన్సు

మొదటి ప్రకరణములో చూపినరీతిగా క్రీ. శ. ౧౭౮౯ లో ఫ్రాన్సు దేశ ప్రజలు శతాబ్దములనుండి జరుగుచువచ్చిన బోర్బన్ రాజుల దౌర్జన్యమును కూలద్రోసిరి. ఆ సందర్భములో ఫ్రెంచిజనులు ప్రజాధికారములను గూర్చి ఇట్లు ప్రకటించిరి:

> " మానవులు పుట్టుకచేతనే స్వేచ్ఛాజీవులు. వారి జీవిత
> " ములు స్వాతంత్ర్యయుక్తమైనవి. న్యాయశాసనములు అం
> " దరికిని సమానముగా వర్తించును. అన్ని రాజకీయ సంఘ
> " ముల యుద్దేశము మానవుని స్వాభావిక స్వత్వముల సం
> " రక్షణయే. ఈ స్వాభావిక స్వత్వములలో శరీరముయొ
> " క్కయు, ఆస్తియొక్కయు, స్వాతంత్ర్యము చేరియున్నది.
> " మరియు అత్యాచార ప్రతిఘటనముకూడ మానవునిస్వత్వ
> " ములో చేరినది. ప్రభుత్వము ప్రజలలోనేయున్నది. ప్రజల
> " నుండి అధికారము పొందనట్టి యేవ్యక్తిగాని, సంఘము
> " గాని శాసింపనేరదు. శాసనమనగా ప్రజలసమిష్టి అభిప్రా
> " యమే. జనులందరికిని అధికార పదవులందుండుటకు సమా
> " నమగు హక్కుగలదు. న్యాయవిరుద్ధముగా ఎవ్వరిపైన
> " గాని నేరము మోపగూడదు. ఎవ్వారినిగాని పట్టుకొన
> " గూడదు. ఎవ్వరినిగాని నిర్బంధింపగూడదు. భావము
> " లనుగాని అభిప్రాయములనుగాని వెల్లడించుట యనునది
> " మానవుని హక్కులలో చాల విలువగలిగినట్టిది."

ఇది సరిగా ౧౫౦ సంవత్సరములనాడు ఖండాంతరములలోని ప్రజలు ఘోరనరకములకు పాలై కష్టించి సాధించి స్వాతంత్ర్యమును సంపాదించుకొని, అనుభవముతో శాసించినట్టి ప్రజాస్వత్వ ప్రమాణ పత్రము,

ఫ్రాన్సు దేశములో ౧౭౮౯ వ సంవత్సరములో అనగా ఫ్రెంచి విప్లవము జరిగిన ఒక శతాబ్దానంతరము ఒక గొప్ప సంఘము "మానవ స్వత్వసంఘము" (League of the rights of man) అనునది స్థాపింపబడెను. ఈ విధానము చాలముఖ్యమైనట్టిది. ఇట్టి సంస్థ ప్రతిదేశములోనుండుట అత్యంతావసరము. ఈ సంఘము వారు ౧౭౮౯ లో శాసింపబడిన ప్రజల హక్కు-శాసనములు కాపాడుటయును, ఎందెందు ప్రజాస్వత్వముల భంగము కలుగునో అందందు తమ యావద్బలమును ప్రయోగించి అన్యాయమును ప్రతిఘటించుటయును అను నుత్తమ కార్యముల చేయుచున్నది. నేటికిని ఫ్రాన్సు దేశములో ౧౭౮౯ లోని సిద్ధాంతములను అమలులోనుంచుచున్నారు. పత్రికలకును కావలసినంత స్వాతంత్ర్యమున్నది.

## అ మె రి కా

ఫ్రాన్సులో స్వదేశరాజుల దౌర్జన్యముండిన అమెరికావారికి, ఇంగ్లీషువారికి లోబడినట్టి పరాధీనతయుండెను. ౧౭౭౬ వ సంవత్సరములో అమెరికావారు స్వతంత్రులైరి. అటుతర్వాత ఆ దేశమందు ప్రజాపాలనము స్థాపితమై ప్రజలచే ఎన్నుకొనబడిన సభ్యులతో కూడిన సెనేటు సభయున్న ప్రజలచేతనే ఎన్నుకొనబడి ౪ ఏండ్లవరకు అధ్యక్షుడుగానుండు అధికారియును దేశమును పాలించువారుగా నేర్పడిరి. రాజ్యాంగములో ప్రజల హక్కులను గురించి ప్రత్యేక శాసనము చేయబడెను. (Bill of rights of the Federal constitution) అందీక్రింది యంశములు ముఖ్యమైనవి:

" జనులయొక్క వాక్స్వాతంత్ర్యమునుగాని, పత్రికాస్వాతం
" త్ర్యమునుగాని, శాంతియుతమైన సమావేశ స్వాతం

" త్ర్యమునుగాని ఏశాసనముకూడ సంకుచితముచేయజాల
" దు. కారణము లేనిదే, ప్రమాణపూర్వకముగా స్థాపింప
" బడనిదే ఎవ్వరినికూడ పట్టుకొనకూడదు. ఎవ్వరి యిం
" టినిగాని శోధించకూడదు. న్యాయస్థానములో స్థిరపరుప
" కయే ఎవ్వరి ప్రాణమునుగాని, ద్రవ్యమునుగాని, స్వేచ్ఛను
" గాని అపహరింపకూడదు. అందరికిని న్యాయము సమా
" నముగా నుండును. అవసరమైన కాఠిన్యము శిక్షలలో
" విధింపకూడదు."

అమెరికాలో అభిప్రాయస్వాతంత్ర్యము అన్నింటిలోను చాల ముఖ్యమైనది. ఆదేశములో ముందు ముందుగా అపోహపడి లేక భయపడి ప్రజలనోళ్లను నొక్కివేయరు. ప్రభుత్వము సరియైనది కాదనికాని లేక ప్రభుత్వమును విప్లవముద్వారా తొలగించివేయవలయుననికాని ప్రజలుపన్యాసము లిచ్చినను అమెరికా ప్రభుత్వము సహనభావము చూపుచున్నది. అభిప్రాయ ప్రకటనతోపాటు హింసాపద్ధతులు కార్యరూపము దాల్చినప్పుడుమాత్రమే శాసనముల ప్రకారము విచారించి పిమ్మట శిక్షింతురు.

ఇట్టి శాసనములుండినను అమెరికాదేశములో తెల్లజాతికి చేరనట్టివారు, నల్ల నీగ్రోలపై ఘోరమైన అత్యాచారములు చేయుచున్నారు. తెల్లస్త్రీలను కొట్టిన తుదకు ముట్టిన నీగ్రోలను తిత్తి ఒలిచి బహిరంగముగా కాల్చుచున్నారు. దీనినే లించింగు (Linching) అనుచున్నారు. ఈ యంశముమాత్రము ఆదేశమునకు తీరని కళంకమైయున్నది. అమెరికా దేశములో అనేకసంవత్సరములనుండి అమెరికా పౌరస్వాత్వముల సంఘము ( American civil liberties Union) అనునది ఇట్టి దౌర్జన్యముల జరుగకుండునట్లుగా శాసనబద్ధమైన ప్రజల హక్కులలో ఏ లోపములైన కలిగినట్లు వారి దృష్టికివచ్చిన తీవ్రాందోళనము చేయుటనుజూడ కొంతి ఆశాజనకమైయున్నది.

# ఇంగ్లండు

ఇంగ్లండు దేశములో ప్రాథమిక స్వత్వముల విషయమై ప్రత్యేక శాసనములులేవు. ఇంగ్లీషువారి జాతీయస్వభావము ఫ్రెంచివారి స్వభావమునకు భిన్నించినట్టిది. ఇంగ్లీషు ప్రజలు స్వాభావికముగా ఉద్రేకగుణము లేనివారు. అట్లుండినను ఇంగ్లీషువారికున్నట్టి స్వాతంత్ర్యభావము ప్రపంచములో మరేజాతిలోను లేదనవచ్చును. ఇంగ్లాండులో రాజ్యాంగము విశేషముగా ఆచారమునుబట్టియే యేర్పడినది. దీనిని వారు లిఖింపబడని రాజ్యాంగ శాసనమందురు- (Unwritten law of constitution) ఆంగ్లేయుల ప్రాథమికస్వత్వములు న్యాయస్థానముల తీర్పులవలనను పార్లమెంటు శాసనముల వలనను, ప్రభుత్వాచారముల వలనను ఈ మూడింటిచే స్థిరపడినట్టివి. ఇంగ్లీషువారి ప్రజాస్వత్వములను గురించి లార్డుఎలింబరో యిట్లువ్రాసినాడు. "ఇంగ్లాండులోని న్యాయశాస్త్రము స్వాతంత్ర్యన్యాయమే యననొప్పును. తదనుసరముగా మాకు నిర్బంధములులేవు. పత్రికలకు ముందుగా (లైసెన్సు) సెలవు తీసుకొను నాచారములేదు. పత్రికలలోని వ్రాతలకుపత్రికానిర్వాహకులు దేశమందువర్తించు సాధారణన్యాయశాస్త్రములకు మాత్రమే బద్ధులైయుందురు"

ఇంగ్లాండులో ప్రభుత్వకార్య నిర్వాహక వర్గమునకు (Executive) నేరములు చేసినతర్వాతనే శిక్షించుఅధికారమున్నది. కాని నేరములు కాబోవునేమోయని ముందుముందుగా నిరోధములుకల్పించు అధికారములేదు. ఇంగ్లాండులో జనులు న్యాయవిరుద్ధముగా నాచరింతురేమోయని ముందు ముందుగా అంచెనాలుకట్టి వాక్స్వాతంత్ర్యమును, రచనాస్వాతంత్ర్యమును నిరోధించరు. అది ౧౬౯౫ వ సంవత్సరమునకు పూర్వము మాట. ౧౬౯౫ వ సం॥నుండి ప్రజలు వాగ్రూపముగా కాక కార్యరూపముగా రాజ్యమందు సాధారణ శాసనములకు విరుద్ధముగా నడిచినా

రిని సక్రమమైన పద్ధతిప్రకారము న్యాయస్థానమందు విచారించి నేరము స్థిరపడిన శిక్షింతురు.

అమెరికాలోను, ఫ్రాన్సులోను ఏవిధముగా ప్రజలహక్కుల సంరక్షించు సంఘములున్నవో అదేవిధముగా "పౌరహక్కులజాతీయసంస్థ" (National council for civil liberties) అను నట్టిది ఇంగ్లాండు దేశములోను కలదు. ఈసంస్థ ముఖ్యముగా ఈ ఆరువిషయములను గురించి విచారించుచుండును.

౧. హక్కు ౨. సభలు ౩. సంఘములు ౪. అభిప్రాయములు ౫. సర్వజనులకు సమహక్కులు ౬. ప్రభుత్వములో ప్రజాప్రాతినిధ్య ప్రాధాన్యత, ఈ ఆరింటియొక్క స్వాతంత్ర్యముకై పైసంస్థ బాగుగా పాటుపడుచున్నది.

## స్విట్జర్లండు

ఈదేశము మన హైదరాబాదు రాష్ట్రములో అయిదవ వంతు మాత్రమే ఉన్నది. ౧౫౯౪౦ చదరపు మైళ్ళవైశాల్యము కలది. జన సంఖ్య సుమారు ౪౦ లక్షలు. అనేకభాషలు మాట్లాడుదురు. అందు జర్మన్, ఫ్రెంచి, ఇటాలియన్ భాషలుమూడును ప్రభుత్వభాషలుగా అంగీకరింపబడినవి. నూటికి ౭౦ మంది జర్మనుభాషను, ౨౧ మంది ఫ్రెంచిభాషను, ౬ ఇటలీభాషను మాట్లాడురు. ఇట్లుండినను ఈమూడు భాషలకును సమానస్థాన మిచ్చినారు. అనగా ఏభాషను గూడ పైకెక్కించి తక్కినభాషలను అణాగద్రొక్కలేదు. ప్రభుత్వ శాసనములు, న్యాయస్థానభాష, శాసనసభలో చర్చలు అన్నియు ఈమూడు భాషలలో నిరభ్యంతరముగా జరుగుచుండును. ఇంతచిన్న రాజ్యములో ఇంత సౌమనస్యము, సౌజన్యము, సౌభ్రాతృత్వమెట్లు స్థిరపడినదో అదొక రమ్యమగు ఘట్టముగానున్నది. ప్రపంచ ప్రభుత్వము లన్నిటిలో ఈచిన్న స్విట్జర్లండులో నుండునట్టి ప్రజాస్వాత్వములు మరెందును లేవనవచ్చును. శాసనసభలకు వోట్లిచ్చుటకు ౨౦ ఏండ్లకు పైబడిన వారందరకని మరే విద్యా ధన సౌకర్యములు

లేకున్నను సమానాధికారమున్నది. ౧౮౭౪ వ సంవత్సరములో ఫెడరల్ (ప్రాంట్లు) శాసనము స్థాపింపబడెను. దానిలో మార్పులు చేయదలచిన ౫౦౦౦౦ వోటర్లు సంతకములు చేసి కోరిన మొత్తము ప్రజల అభిప్రాయమును (Referendum) కొని అధికసంఖ్యాకుల అభిప్రాయము ప్రకారము ఆచరింతురు.

ఇక మత స్వాతంత్ర్య విషయములందును ఇతర దేశములకు అందు ముఖ్యముగా మతోన్మాదములో పూర్తిగా మునిగిన భారతదేశమునకు ఈ స్విట్జర్లాండు దేశము గుణపాఠము నేర్పుచున్నది. ౧౮౭౪ లో గావింపబడిన రాజ్యాంగశాసనము (Constitutional act) ప్రకారము ఆప్రభుత్వానికి ఏమత సంబంధమును లేదు. మతశాఖలేనే లేదు. మతపక్షపాత మంత్రికను లేరు. ఎవరిష్టమువచ్చినట్లు ప్రార్థించుకొనవచ్చును. ఇష్టమువచ్చిన మతమును అవలంబించవచ్చును.

## రష్యా

రష్యాదేశమునుండికూడ మనము నేర్చుకొనవలసిన సంగతులనేకములకలవు. ఒకటి నిరంకుశ రాజ్యాధికారము ఎన్ని శతాబ్దములు సాగుచు వచ్చినను ధ్వంసమైననాడు పేరు ఊరు గుర్తులేకుండునట్లు క్షణమాత్రములో మాయమై పోవును. రెండవది దేశమెంత హీనస్థితిలోనుండినను సరియైన పరిపాలనా వ్యవస్థ యేర్పడినచో ఆశ్చర్యకరమగురీతిగా అత్యల్పకాలములోనే అభివృద్ధికివచ్చును. లెనిన్ సర్వ రష్యాదేశ నియంతఅయిన ౧౯౧౭ వ సంవత్సరములో రష్యాలో నూటికి ౧౩ మందిమాత్రమే విద్యనేర్చినవారు. లెనిన్ పరిపాలనలో ౧౯ సంవత్సరముల కాలములో అనగా ౧౯౩౬. నాటికి లెక్క చూడగా నూటికి ౭౭ వరకు విద్యనేర్చినవారేర్పడిరి. ఇట్టి రష్యాలో గతసంవత్సరములో ౧౯౩౬లో నొక రాజ్యాంగశాసన మంగీకరింపబడెను. అందు ముందు రాజ్యాంగవ్యవస్థ నిర్ణయింపబడెను. ఇతర విషయములతోపాటు మన కిందు సంబంధించిన ప్రాథమిక స్వత్వముల విషయమై ఈ రష్యాలోని నూతనరాజ్యాంగములో ప్రత్యేక

నిబంధనలు అంగీకరించి శాసనరూపముగా స్థిరీకరించియున్నారు ఈ రాజ్యాంగ శాసనములో ప్రతిరష్యా ప్రజకున్ను జీవనోపాధి, విశ్రామము, ఉచిత విద్యను ఏర్పాటుచేయుట ప్రభుత్వము విధిగా సంగీకరించినారు. ముఖ్యముగా ప్రజల స్వత్వములను అంగీకరించియున్నారు. ఆత్మస్వాతంత్ర్యము, నివాసస్వాతంత్ర్యము, వాక్కుస్వాతంత్ర్యము, పత్రికలయొక్కయు, సభలయొక్కయు సంపూర్ణస్వాతంత్ర్యము, శాసనబద్ధముచేసి అంగీకరించియున్నారు.

అయితే కొందరు నిరంకుశ పరిపాలనావాదులు - ఇటీవల రష్యాలో స్టాలిన్ పరిపాలనలో సంపలకొలది జనులను తలగొట్టించినమాట కేమనవలెను. అని యాక్షేపించవచ్చును. అట్లు వాదించువారు అనేకప్రభుత్వములలోని రాజ్యాంగ విధానములలో శాసనరూపముగానైనను ఈ ప్రజలహక్కులు శాసింపబడలేదనునది గమనించవలెను- మరియు రష్యాలో ఇటీవల జరిగిన శిక్షలు సంపూర్ణమైన విచారణానంతరమే నేరము స్థిరపడిన తర్వాతనే జరిగినవని గమనింపవలెను. రాజద్రోహము దేశద్రోహము చేయుటకును శత్రుదేశములవారి లంచములపొంది మాతృదేశమును నాశనముచేయుటకును నునుకట్టిన దుష్టులను విచారించి శిక్షించినారు. అందు అనవసర కాఠిన్యము మాత్రముండినదని యంగీకరింపక తప్పదు. ప్రాథమిక స్వత్వములు మొదట ప్రభుత్వము అంగీకరించుటయే ప్రజలకు ప్రథమవిజయమని గ్రహించవలెను.

ఈ ప్రకారముగా ప్రపంచమందలి ముఖ్యదేశములలో ప్రజల స్వాతంత్ర్యములు వీలైనంతవరకు గౌరవింపబడి కాపాడబడుచున్నవి. ప్రజలంతటితో తృప్తిచెందక తమ అధికారములలో న్యాయమైన స్వేచ్ఛాజీవనములో ఏవిధమైన అన్యాయము కూడ జరుగకూడదను పట్టుదలతో ప్రతిదేశమందుస్వాతంత్ర్యరక్షక సంఘములేర్పరిచి ప్రశంసనీయమును, స్వార్థరహితమును, ప్రజాహితమును నగు విధముగా ఆ సంఘముల నడుపుచున్నారు.

# భారతదేశములో ప్రజాస్వత్వములు

## ౪

హిందూస్థానములోని పరిస్థితులొకరీతిగాలేవు. దాని చరిత్రకూడ చాలచిత్రమైనదే. నానామతములు, నానాశాఖలు, అనేకరాజులు, భిన్నభిన్నకులములు, భిన్నభిన్నభాషలు, నిరంతర యుద్ధములు, ఘోరమగు అత్యాచారములు, జనులలో స్థిరపడిపోయిన విద్యారాహిత్యము, ఇవి భారతదేశ చారిత్రికఘట్టములు. ఇంగ్లీషువారు దేశమునంతయు సంపూర్ణముగా స్వాధీనపరచుకొనిన తర్వాత అన్నియు క్రొత్తసమస్యలే బయలుదేరెను. ఇంగ్లీషుభాష ప్రభుత్వభాష యయ్యెను. దేశభాషలుమూలబడెను. ఆర్థిక విప్లవము దేశమంతయు వ్యాపించుకొనెను. రాజకీయముగనేగాక ఆర్థికముగను భారతదేశము పరాధీనమయ్యెను. దారిద్ర్యము హెచ్చిపోయెను. అయిదారు వందల సంస్థానములు బ్రిటిషువారి అధీనములో వర్తించుచు ప్రతిదేశీయ సంస్థానమందును భిన్నభిన్న మర్యాదలు ఏర్పడిపోయెను. ఇట్టి పరిస్థితులలో భారతీయులకు ఎంతవరకు ప్రాథమిక హక్కులున్నవో నిర్ణయించుట కష్టము. బ్రిటిషువారి అనుగ్రహాముపైన ఇవన్నియు ఆధారపడినవి.

భారతదేశములో ప్రజాభిప్రాయ ప్రకటనము అఖిలభారత జాతీయమహాసభ (కాంగ్రెసు) యొక్క ఉత్పత్తితోనే ప్రారంభమైనదనియే చెప్పవలెను. ఇంగ్లీషు అధికారులు తమకు లభించిన సామ్రాజ్యమును జారిపోకుండ కట్టుదిట్టములు చేసికొనుటలో నెంతయు

నాశ్చర్యములేదు. అందుచేత కాంగ్రెసువాదులను అనుమాన దృష్టి తోచూడదొడగిరి. ఎట్లెట్లు కాంగ్రెసు విజృంభించుచు వచ్చెనో అట్లట్లుబ్రిటిషుప్రభుత్వము వారుకూడ, రాజద్రోహపునేరములకై జనుల శిక్షించుచువచ్చిరి. పత్రికలపై నిరోధములు కలగించిరి. "రౌలెట్ ఆక్టు" అని ప్రసిద్ధివహించిన స్వాతంత్ర్యనిరోధక శాసనమునుగావించిరి. బెంగాలులో విచారణలేకయే అనుమానస్థులను జెయిళ్ళలో వేసిరి. జాలియన్ వాలాబాగు దురంతములును పంజాబులోని అత్యాచారములును గాంధీగారిసహాయ నిరాకరణోద్యమ విజృంభణమునకు దారిచూపెను. బ్రిటిషిండియా ప్రభుత్వమువారు భారతీయులను ఇతర దేశములకు పోవుటవిషయములలో సెలవొసగుటకు లేక నిరాకరించుటకు, ఇండియానుండి వెడలగొట్టుటకు లేక దేశములోనికి రానీయకుండుటకు అధికారములు గలిగియున్నారు. సరిపడని ప్రజలను వెడలగొట్టు లేక నిరోధించు విషయమును గురించి లార్డుమార్లీగారీప్రకారము సెలవిచ్చిరి:

" అదేపనిగా చాలకాలము నిరోధించి యుంచుటవలన దుర్మార్గులు భయపడుదురని చెప్పవచ్చును. ఇది రష్యావాదముగా నున్నది. అనుమానగ్రస్తులనందరిని రైళ్ళలో భర్తీచేసి సైబీరియాకు పంపుటచే వారు బెదరిపోయి సర్వము శుభముగా పరిణమించునని తలతుము. రష్యాలో ఆపద్ధతి సరిగా పనిచేయలేక పోయెను. అది జనుల ప్రాణముల రక్షించలేకపోయెను. తుదకు అది రష్యానే రక్షించలేక పోయెను."

ఇట్లు కఠినముగా పరిపాలించినను బ్రిటిషు ప్రభుత్వమువారు ప్రజలలో ఆందోళన మభివృద్ధినొందుకొలది అవసరములను బట్టి కొన్ని అధికారములను ఇచ్చుచువచ్చినారు. పత్రికలకు ప్రత్యేకపరిస్థితులందు తప్ప తక్కినకాలములలో చాలవరకు స్వాతంత్ర్యమిచ్చినారు. అన్యాయముగా నిర్బంధించిన ఖైదీలను క్రమ క్రమముగా వదలుచువచ్చినారు. రాష్ట్రములలో ప్రజాప్రతినిధులతో కూడిన శాసనసభలు చాలమట్టుకు కాంగ్రెసు అధికారములోనికి వచ్చినవి.

౧౯౧౮ వ సంవత్సరములో కాంగ్రెసులోను, ముస్లింలీగు లోను ఏకగ్రీవముగా ఈక్రింది తీర్మానము గావింపబడెను.

"ఇండియా ప్రభుత్వమువారు భారతీయులయొక్క ఈ
" క్రిందిహక్కులను సంరక్షించుచు దేశముయొక్క సంరక్ష
" ణము, శాంతిరక్షణమును చేయుట కధికారము కలిగియు
" న్నారు. పార్లమెంటువారు భారతదేశమున కిచ్చు రాజ
" కీయసంస్కరణములలో ఈ క్రిందిహక్కులను స్థాపించవలసి
" యుండును. ఇండియాలోని ప్రజల దరికిని న్యాయశాసన
" ములు సమానముగా వర్తించవలెను. పక్షపాతముతో
" కూడిన శిక్షాశాసనమేదియు చేయకూడదు. ఏ భారతీ
" యునికిగాని, జీవితముయొక్కయు, ఆస్తియొక్కయు,
" వాక్కుయొక్కయు, సభలయొక్కయు, రచనలయొక్క
" యు స్వాతంత్ర్యములో ఏమియు భంగము కలుగరాదు.
" న్యాయస్థానములలో న్యాయమైన విచారణచేసి దోషిగా
" నిర్ణయింపబడిన వారినే శిక్షించవలెను. ప్రతి భారతీయు
" నికిని ఇంగ్లాండులోవలెనే లైసెన్సు క్రయమిచ్చి ఆయుధ
" ములు పట్టుకొనుటకు అధికారముండవలెను. పత్రికలు స్వాతం
" త్రముగా నుండవలెను. వాటినుండి లైసెన్సుగాని, జమా
" నతుగాని తీసికొనకూడదు."

పై తీర్మానమును విశదీకరించుచు ౧౯౩౧ వ సంవత్సరములో జరిగిన బొంబాయి కాంగ్రెసులో ఈ క్రింది విశేషముగా తీర్మానము అంగీకరింపబడెను.

"స్వరాజ్యమనగా కాంగ్రెసువారి భావమేమో సామాన్య ప్రజలకు తెల్లముగా తెలియుటకై వారి కర్థమగురీతిని కాంగ్రెసు వారి యభిప్రాయమును ప్రకటించుట యవసరము. సామాన్యజను లను దోచుకొను నిప్పటిపద్ధతి పోవలయునన్నచో రాజకీయ స్వాతంత్ర్యమునందు సామాన్యజనుల యార్థిక స్వాతంత్ర్యముగూడ జేరి యుండవలెను. కావున కాంగ్రెసువా రంగీకరింపదగిన ఏ రాజ్యాంగ

మునందైనను నీ్క్రింది యంశము లుండవలయును- లేదా నీయంశము లను రాజ్యాంగములో జేర్చుటకు స్వరాజ్య ప్రభుత్వమువారి కధి కార ముండవలయును:

ప్రధానహక్కులు — విధులు

(౧) భారత దేశములో ప్రతి పౌరుడును తనయభిప్రాయములను స్వేచ్ఛగా ప్రకటించుటకును, యిష్టమువచ్చినవారితో గూడి ఇష్టముపవచ్చిన సంఘమున జేరుటకును, న్యాయమునకు నీతికి విరుద్ధములుగాని పనులకొరకు నాయుధములు లేకుండ నిష్ట మువచ్చినట్లు సమావేశ మగుటకను హక్కుగలిగియున్నాడు.

(౨) ప్రతి పౌరుడును దన యంతరంగమునకు తానే యధికారియై తన మతమును తానే స్వేచ్ఛగా ప్రకటించి యాచరించుచు ప్రజానీతికిని, శాంతికిని భంగములేనట్లు ప్రవర్తింప హక్కు కలిగియున్నాడు-

(3) అల్ప సంఖ్యాకుల విజ్ఞానము, భాష, లిపులును, నాయా భాషా రాష్ట్రముల విజ్ఞానభాషా లిపులును సంరక్షింపబడ వలయును-

(౪) పౌరులెల్లరును వర్ణ మత లింగ భేదములు లేక న్యాయశా స్త్రముఖమున సమానులే.

(౫) ఏ పౌరు లెట్టి ఉద్యోగమును సంపాదించుటకుగాని, యెట్టి యధికారమును బొందుటకుగాని, యెట్టివ్యాపారమును, నెట్టి వృత్తిని నవలంబించుటకుగాని, వారి వర్ణ మత లింగములను బట్టి యెంతమాత్రమును నసర్హత పొందజాలరు

(౬) ప్రభుత్వమువారిచేతగాని, స్థానిక ప్రభుత్వములచేతగాని, సర్వ జనోపయోగార్థమై వ్యక్తులొసగిన ధనముచేతగాని నిర్మింప బడిన బావులు, చెరువులు, రోడ్లు, పాఠశాలలు, ప్రజావిహా రస్థలములు మున్నగువానికై పౌరు లెల్లరకును సమానమగు హక్కులును, బాధ్యతలును కలవు.

(౭) ప్రతిపౌరునికిని శాసనానుసారముగ నాయుధములను బట్టి తిరుగు హక్కుగలదు.

(౮) లాప్రకారముగాక యేపౌరుని స్వాతంత్ర్యమునుగాని, వాని గృహమునుగాని, వాని యాస్తినిగాని, యెవ్వరును ప్రవేశింప గూడదు, లాగుకొనగూడదు, వశము జేసుకొనగూడదు.

(౯) అన్ని మతముల విషయమునను ప్రభుత్వము తటస్థభావమును వహించును.

(౧౦.) మైనారిటీవెళ్లిన జనులెల్లరకునువోటుహక్కుండవలయును.

(౧౧) ప్రభుత్వము వారు దేశములో సంతటను నుచితముగ నిర్బంధ ప్రాథమిక విద్యావిధానమును ప్రవేశపెట్టవలయును.

(౧౨) ప్రభుత్వమువా రెవ్వరికిని బిరుదము లీయకూడదు.

(౧౩) మరణదండన ముండరాదు.

(౧౪) ప్రతిపౌరుడును భారత దేశమందెట యిష్టము వచ్చినట్లు ప్రయాణము చేయవచ్చును. ఇష్టమువచ్చినచోట ఆస్తిని సంపాదించుకొనవచ్చును ఇష్టమువచ్చిన వ్యాపారమును, వృత్తిని నవలంబించ వచ్చును. భారతదేశమం దన్ని ప్రాంతములందును నేరారోపణ విషయమున సమానమైన హక్కులుపొంది, సమానమైన రక్షణము లుండవలయును.*

ఇట్లు కాంగ్రెసులో పలుమారు తీర్మానించినను ఇంకను ప్రజాస్వత్వముల నంగీకరించు శాసనము గావింపబడలేదు. భారతీయులు ఇతర నాగరిక దేశములలో — అందునను ఇంగ్లాండులోని ఇంగ్లీషువారి కేవిధమగు ప్రజాధికారములున్నవో అవియే అడుగుచున్నారు. కాంగ్రెసువారు న్యాయశాఖనుండి కార్య నిర్వాహక శాఖను విడదీయవలెనని అనేక సంవత్సరములనుండి కోరుచున్నారు.

పత్రికాశాసనము మొట్టమొదట ఇండియాలో క్రీ. శ. ౧౮౬౭ లో గావింపబడెను. దానిప్రకారము మేజిస్ట్రేటు అనుమతిలేనిది

యెవ్వరును పత్రికనుస్థాపించకూడదు. కాని ఆశాసనమంత కఠినముగా లేకుండెను. పత్రికలలో శక్తి విజృంభించినది గమనించి క్రీ. శ. ౧౯౧౦ లో ఇండియన్‌ప్రెస్ శాసనముగావింపబడెను. దానిప్రకారము ముద్రాపకులు ౫౦౦ రూపాయలకు తక్కువకానట్టియు అధికారులు నిర్దేశించినట్టియు మొత్తమును జమానతుగా పెట్టిననేగాని పత్రికలకుసెలవీయబడదు. మరియు పై శాసనములో ౪వ సూత్రమున పత్రికలో రాజద్రోహవ్యాస మేదైన ముద్రింపబడినట్లైన ఆ నగదు జమానతు సాంతము జప్తీ చేయబడుననియు, అట్టి వ్యాసము గల పత్రికలుగాని, పుస్తకములుగాని అన్నియు జప్తీ చేయబడుననియు శాసింపబడెను. ఇప్పుడు కాంగ్రెసుప్రభుత్వము వచ్చిన రాష్ట్రములలో జప్తీ అయిన మొత్తములు చాలవట్టు తిరిగి యియ్యబడుచున్నవి.

సభల విషయమై బ్రిటిషుఇండియాలో ౧౯౦౭ వ సంవత్సరము వరకు ఏ ప్రత్యేక శాసనమును లేకుండెను. ౧౯౦౭ లో ఒక శాసనముచేసిరి. దానియుద్దేశ్యము శాసనమందే యిట్లున్నది: "రాజద్రోహమును వృద్ధిపరచునట్టివియును లేక ప్రజోపయుక్తములగు విషయములలో అల్లరులు కలిగించునట్టి బహిరంగసభలవిషయమై మేలైన నిరోధక పద్ధతులను నవలంబించుట" అనునది ముఖ్యోద్దేశము. పై శాసనముయొక్క ౯వ సూత్రములో ఇట్లు శాసించిరి. "ఈ శాసనము నేటినుండి ౩ సంవత్సరములవరకు వర్తించును" తరువాత మరల ఈశాసనముగాని లేక అట్టివేరుశాసనముగాని కావింపబడలేదు. అయినను ఫౌజ్దారీశాసనములలోని సూత్రములను తమ సేవలోనికి అధికారులు తీసుకొనుచునేయున్నారు. మరియు క్రిమినల్ లా సవరణ శాసనమనుపేరుతో గావించిన దానిలో అత్యంత కఠిన నిబంధనలు కలవు. అవి పూర్తిగా ప్రాథమిక స్వత్వములను ధ్వంసముచేసినట్టివిగానున్నవి.

భారతదేశములోని ఆయుధనిషేధము ఒకప్రత్యేకలక్షణము. ౧౮౫౭ వ సం॥లో భారతదేశమందు గొప్ప విప్లవము జరిగెను.

దానినే మ్యూటినీ అందురు. ఆ మ్యూటినీలో కొంత కాలము ఇంగ్లీషువారికి ఈ దేశమున అస్తిత్వమేయుండదేమోయనిఅనిపించు నట్లయ్యెను. తుదకు ఇంగ్లీషువారే విజయమందిరి. అప్పటినుండియు భారతీయులను ఆయుధముల పట్టనిచ్చుట ప్రమాదకరమని ఆయుధ శాసనము (Arms Act) ను జేసి నిషేధించిరి. తత్ఫలితముగా హైందవులు క్రమక్రమముగా పిరికివారగుచున్నారని దేశీయనాయకులు కాంగ్రెసులో పలుమారులు ఆ శాసనమును రద్దుపరచమని కోరినారు. కాని ఫలితములేకపోయెను.

భారతదేశములో ప్రభుత్వోద్యోగముల సమస్య ప్రత్యేకత వహించునట్టిదే. ఇండియన్ సివిల్‌సర్వీసులో బహుకాలమువరకు కేవలము ఇంగ్లీషువారే నియమితులగుచుండిరి. దానిని "ఉక్కు-చట్టము" (Steel frame) అని లాయిడ్ జార్జిగారు ప్రధానమంత్రిగా నుండినప్పుడు వర్ణించి మెచ్చుకొనిరి. ఉన్నతోద్యోగములలో విశేషభాగము ఇంగ్లీషువారేయున్నారు. ఈ పరిస్థితులనుగమనించియే గో॥కృ॥ గోఖలేవంటి మితవాదికూడ తీవ్రముగా నాక్షేపించ వలసివచ్చెను. "ఉన్నతోద్యోగములను కేవల మొకవృత్తికొరకు కోరుటలేదు. అధికారసంబంధమగు ఉద్యోగములన్నియు ఒకే జాతి వారి గుత్తా అయిపోయినట్లైన వాటినుండి దూరముగా నుంచబడిన వారు ఎల్లప్పుడును తాము తక్కువదర్జాలో చేర్చబడితిమని మనోబాధను పొందుచుందురు. కావున ఈసమస్య జాతీయ గర్వమునకును ఆత్మగౌరవమునకు సంబంధించినది" అని గోఖలేగారు అభిప్రాయపడిరి.

రెండు సంవత్సరములక్రిందట బ్రిటిషిండియాలో "హైందవ పౌరస్వాతంత్ర్య సంఘము" (Indian civil liberties Union) స్థాపింపబడినది. దానికధ్యక్షులురవీంద్రనాథఠాకురుగారు. కాంగ్రెసు

అధ్యక్షులుగా నుండిన జవాహిర్ లాల్ నెహ్రూగారే ఈ సంఘ స్థాపనమునకు కారకులైనారు. ఈ సంఘమింకను బలవత్తరము కాలేదు. చాల ప్రారంభదశలోనేయున్నది. రానున్న ఫెడరేషన్ లో మార్పులు జరిగినట్లైన, ఆమార్పులు కాంగ్రెసు వారికి సమ్మత మైన భారత దేశమందును ప్రాథమికస్వత్వమునకు ఒకవిధమగు స్థాన మును స్థిరత్వమును ఏర్పడవచ్చును.

హైదరాబాదు రాష్ట్రములోని

# ప్రాథమిక స్వత్వములు

---

## ౫

భారత దేశమందలి విచిత్రములలో దేశీయ సంస్థానముల లోని పరిస్థితులుకూడ చేరదగినట్టివి. సుమారు ౫౬౦ సంస్థానములు దేశీయ ప్రభువుల ఏలుబడిలోనున్నవి. ఇంచుమించు అన్ని సంస్థానములును బ్రిటిషిండియాకన్న చాల వెనుకబడి యున్నవి. అనేక సంస్థానములలోని అత్యాచారములు, అన్యాయములు, ఏలికల మితిమీరిన వ్యయములు, నిరంకుశ చర్యలు, వీటిని గురించి ఇంగ్లాండు పత్రికలకుగూడ అరేబియను రాత్రి కథలవలె గాన్పించుచున్నవి.

కొన్ని సంవత్సరములనుండి దేశీయ సంస్థాన ప్రజలు ఏకమై సభలను జేసికొనుచున్నారు. ౧౯౩౬ లో, కరాచీ నగరమున డాక్టరు పట్టాభి సీతారామయ్యగారి అధ్యక్షతలో అయిదవ దేశీయ సంస్థాన ప్రజలసభ జరిగెను. డా॥ పట్టాభిగారి అధ్యక్షోపన్యాసమునుండి కొన్ని భాగము లుదహరించిన దేశీయ సంస్థానములలోని ప్రజల స్థితిగతులు తెలియగలవు.

> "సంస్థానప్రజల మహాసభవారగు మీరు నవనగరు యొక్క జాం సాహెబుగారి నిరంకుశత్వమును బయలుపెట్టితిరి. జోధపూరు, గోండల్, ఆల్వార్, బికానీరు సంస్థానములలోని అత్యాచారములు బయలుపరచితిరి. ముఖ్యముగా పటియాలా మహారాజుగారిపై నేరములను మోపితిరి. శిరోహీ మహారాజుగారు చేసిన స్త్రీ బలవద్గమనముల, న్యాయరహి

తమగు నిర్బంధములను బహిరంగముగా విచారించుమని మీరు కోరితిరి. దేశీయ సంస్థానములందలి వెట్టిచాకిరీని బయలు పెట్టితిరి."

"లహరూ సంస్థానములో తిరుగబడిన ప్రజల యిండ్లలోబడి నవాబుగారి భటులు లూటీ చేసిరి. దేవాలయమును అపవిత్రము చేసిరి. స్త్రీలను చెరిచిరి."

"భారత దేశమందు సంస్థానప్రజల సమస్య గందరగోళముతో కూడినది. నిజాముగారు ౧౮౦ లక్షల మందిపై రాజ్యము చేయుచున్నారు. అందు ౧౩౦ లక్షలు హిందువులు. అట్లుండినను ఉర్దూభాషయే రాజ్యభాషయు, బోధనాభాషయు నైయున్నది. భూపాల్ నవాబుగారు ౭ లక్షల మందిపై రాజ్యము చేయుచున్నారు. అందు నూటికి ౧౧ గురే ముసల్మానులు. అచ్చటను రాజభాషయు విద్యయు ఉర్దూలో జరుగుచున్నది. కాశ్మీరు రాజు హిందువు. ప్రజలు ముసల్మానులు. వారు వ్యవసాయ కష్టముల భరింపలేక అల్లరులు చేసిరి... ........ఈ దేశీయ రాజ్యములు ఒక అధోలోకముగా నున్నవి."

ఇవి భారతదేశ నాయకుల దృష్టిలో దేశీయ సంస్థానములందలి పరిస్థితులను గురించిన భావములు.

దేశీయ సంస్థానములన్నింటిలో గొప్పది హైదరాబాదు రాష్ట్రము. ఈ రాష్ట్రములోని ప్రజా స్వత్వములను గురించి ఇప్పుడు ఉన్నత న్యాయస్థానములో న్యాయమూర్తిగా నున్నట్టి ఆర్. యస్. నాయకు ఎం. ఏ. బారిస్టరుగారు ౧౯౩౧ వ సంవత్సరములో బీరారులోచేరిన అకోలా నగరములో హైదరాబాదు రాజకీయ మహాసభయొక్క అధ్యక్షపదవి నలంకరించి తమ అధ్యక్షోపన్యాసములో సెలవిచ్చిన కొన్ని భాగము లుదహరింపబడుచున్నవి.

"మనమెన్నియో సభలనుగురించి వినినాము. కాని యీసభా వృత్తాంతము అపూర్వమైనట్టిది. హైద్రాబాదు ప్రజలను తమ రాష్ట్రములోనే తమ భావములను వెల్లడింప నీయనందున మేము రాష్ట్రము వెలుపలికి రావలసివచ్చెను.

"హైద్రాబాదులో పోలీసు గష్తీ (గిరె) కలిగించినట్టి అసంతృప్తిని మరే విషయము కూడ కలిగించ లేదు.

"విద్యా విషయములో అధిక సంఖ్యాకులభాష కానట్టిఉర్దూ ద్వారా విద్యనేర్పించు పరిశోధనపై గొప్పగా వ్యయమగుచున్నది ... ... ... పైగా ఖాస్గీబళ్ల నిషేధము విద్యావ్యాపకములో గొప్ప నిరోధకారి.

"హైద్రాబాదులో కొన్ని పత్రికలకు ప్రభుత్వము సహాయము చేయుచున్నదని ఆక్షేపణకలదు. బ్రిటిషిండియాలో పత్రికల స్థితి చెడ్డగానేయున్నది. హైద్రాబాదులో అంతకన్న అధ్వాన్నముగానున్నది. ఏమియు కారణము చూపకుండా పత్రికలను క్షణమాత్రములో బందుచేయుచున్నారు."

నిజాం ప్రభుత్వమువారు ఇటీవల తమ రైతుల ఆర్థికాభివృద్ధికై అనేక శాసనముల గావించియున్నారు. వ్యవసాయాభివృద్ధికై చెరువులు కాలువలు కట్టించియున్నారు. ఆర్థిక మాంద్యము కలిగినప్పుడును క్షామ పరిస్థితు లేర్పడినప్పుడును పన్నులలో తగ్గింపులు చేసియున్నారు. విద్యాభివృద్ధికై ద్రవ్యము బాగుగానే వ్యయము చేయుచున్నారు. హైద్రాబాదు నగరమును కోట్ల ద్రవ్యము వ్యయము చేసి నందనవనముగా మార్చుచున్నారు. జిల్లా ప్రధాన స్థలములలో నీటి వసతులు, రోడ్లు, వెలుతురు, మున్నగు సౌకర్యములు వృద్ధిచేయుచున్నారు. పలుమారు ప్రజాభిప్రాయమును కొంతవరకు స్వీకరించుచున్నారు. ఇట్లు వారుచేయునట్టి సత్కార్యములను ప్రశంసించుచు మనకిప్పుడు సంబంధించినట్టి ప్రాథమిక స్వత్వములను గురించి చెప్పవలసినప్పుడు ఈ విషయములో చూపవలసినంత ఔదార్యము

ఇంకను చూపలేదనియే చెప్పవలసి యుండును. ఇక నిజాం రాష్ట్ర ములో వివిధ ప్రాథమిక స్వత్వము లేవిధముగా లేవో సంగ్రహ ముగా తెలిసికొందము.

## వాఙ్నిరోధము

దుర్యశముపొందిన గష్తీ గిర్తె సర్వజన విదితమే దానిలో నిజాం ప్రభుత్వమువారు కొద్ది సవరణలు ఇటీవల చేసినారు.తదనుసార ముగా సభలు రెండు విధములు.

(౧) విద్యా ధార్మికములు, సాంఘికములు, సారస్వతములు.
(౨) మతము, రాజకీయములు, మొదటివర్గములో చేరని

అన్ని విషయములను.

మొదటితరగతి సభలకు అనుమతి అవసరములేదు. కాని అధి కారులకు ముందుగా అట్టిసభలు చేయుచున్నామని మాత్రము తెలు పవలెను. రెండవతరగతి సభలకు పూర్వమువలెనే అనగా జిల్లా తాలూకాదారుగారికిని నగర కోత్వాలుగారికిని ౧౦ దినములు ముందుగా తెలుపవలెను. అనుమతి పొందవలెను. అనుమతి లేనిది చేయరాదు. ఈక్రొత్త గష్తీని చేయుటలో ప్రభుత్వమువారియుద్దేశము అర్థముకాదు.ఇదిమునుపటిగష్తీకన్న కఠినముగా నున్నది. ఈనూతన వాగ్బంధక శాసనము రాష్ట్ర ప్రజలకు మరింత ఘోరాకార ముతో కష్టములు కలిగించుచున్నది. "సభ" యొక్క వర్ణనకూడ అతి సంకుచితముగా నున్నది. కొన్ని సమయములలో విందులు, కార్య నిర్వాహకసభలు, శ్మశానములుకూడ సభలుగా పరిణమించు నిర్వచనము మంచి విశాల నియమములతో కావించియున్నారు.

# ఉత్సవములు

దసరా మొహర్రములు ఒకే కాలములో వచ్చు గతిపట్టిన దసరా ఉత్సవములు చప్పుడు లేకుండా చేసికొనవలెను. నిశ్శబ్దముగా సీమోల్లంఘనము చేసికొనవలెను. జండాయెత్తిన అది ౧౫ మొహర్రమునాడే యెత్తవలెను. (చూడుడు గస్తీ. ౩, తేది ౧౩ ఆబాన్ ౧౩౨౯ ఫ.)

కొంతకాలము ఆపుదలలోనుండి మరల రెండవమారా మతోత్సవము చేయదలచిన మత శాఖవారి అనుమతి లేనిది చేయకూడదు, చూ గస్తీ ౪ సం॥ ౧౩౨౯ ఫ.

మసీదులముందు వాద్యములు మోగించకూడదు. (గస్తీ ౩ సం॥ ౧౨౯౫ ఫ.)

మసీదుకు ౩౦౦ గజముల లోపల వాద్యములు కూడదు (మతశాఖ గస్తీ ౪౧౪ తా॥ ౨౭ ఆజుర్ ౧౩౧౦ ఫ.)

మునసల్మానులెక్కువగా నుండుచోట ప్రాత దేవళములు, మతములు బాగుచేయకూడదు మార్పులు చేయకూడదు. (మతశాఖాజ్ఞ ౧౯–౧౦–౧౩౦౭ ఫ. మరియు మసీదులముందు బాజా భజంత్రీలు వాయించు విషయములో ఈక్రింది నియమాలు చేసిరి. చూడుడు (౨౨–౩–౪౪ ఫ. తేదిన చేయబడిన మతశాఖవారి నియమాలు)

(౧) మసీదులవద్ద రెండుదిక్కుల ఒక్కొక్కదిక్కున ౧౦౦ అడుగుల దూరమునుండియే వాద్యధ్వనులుచేయుట మానుకొనవలెను.

(౨) మసీదునుండి కొలత వేయుటలో దాని ఆవరణమునుండి లెక్కపెట్టవలెను.

(౩) ౧౦౦ అడుగుల లోపల మసీదువద్ద ఉండే ఇండ్లలోను దేవాలయములలోను ముసల్మానులు చేయునట్టి ౫ మారుల నమాజుకాలములలో వాద్యధ్వనులు చేయకూడదు. అట్టి సమ

యములలో "జయ" కారములున్ను చప్పట్లున్ను మరి యేలాటి ఆటంకములు కలిగించు ధ్వనులున్ను చేయగూడదు.

(౪) ఈ నియమాలకు విరుద్ధముగా నడుచువారికి ౧నెల జెయిలు శిక్ష లేక ౨౦౦ రూపాయీలవరకు జుర్మానా లేక రెండున్ను విధింపబడును.

(౫) ఈ సంబంధములో పూర్వము కావింపబడిన నియమాలు రద్దుపరచి యీ నియమావళియే అమలులో నుంచబడినది.

## పత్రికలు

పత్రికలకు సాధారణముగా అనుజ్ఞ ఇయ్యబడదు. పత్రిక నడుపువాడు అనుమతి కోరిన, వాని గుణ విశేషములు, వాడు ముల్కీవాడా కాడా, వానికి పత్రికనడుపు శక్తియున్నదా లేదాఅనువిషయములువిచారింతురు. సాధారణముగా అనుమతి నిరాకరింతురు. అనుమతి పొందినవారు రాజకీయములను గురించి ఏమియు వ్రాయమనియు ఇతర మతములను మతస్థులను దూషించుచు లేక అవమానపరచుచు వ్రాయననియు ఒప్పుదలపత్రము వ్రాసి యియ్యవలెను. ఈ ఒప్పుదలకు విరుద్ధముగా నడిచిన పత్రిక ఆపివేయబడును. ఇటీవల నగదు జమానతు తీసికొను క్రొత్త ఆచారము ప్రారంభించినారు.

## వెట్టి

నిజాం ప్రభుత్వమువారు తమ రాష్ట్రములో వెట్టిచాకిరీ విశేషముగా నుండుటను గమనించి అనేక సంవత్సరములకు పూర్వమే అనేక గష్తీలు, ఫర్మానులు, కావించియున్నారు. అట్లుచేసినను జిల్లాలలో నేటికిని అధికారులుకొందరువెట్టిచాకిరీ చేయించుకొనుచున్నారనియు, వెట్టి చేసినవారికి ప్రతిఫలమియ్యరనియు ఇచ్చినను సరియైనదియ్యరనియు అనేకసభలలో చాలామారులు తీర్మానములుచేసినారు. వెట్టి ఒక్క

హరిజనులనుండియే తీసుకొనరు. రైతులు ఎడ్లబండ్లను అధికారులు వచ్చినప్పుడు వంతులుగా కట్టు ఆచారము కనబడుచున్నది. మరియు కోమట్ల దుకాణములపై కొందరు అధికారులు చిట్టీలుపంపి తమ భోజనసామగ్రిని, తమ గుర్రముల దాణాను తెప్పించుకొని పైకమియ్యక యెగబెట్టుటయో లేక ఇచ్చునంతటి పుణ్యముకట్టుకొనిన ఏ సగము పాతికక్రయమో యిచ్చుటయో పలుమారులు వినుచున్నాము.

ఇట్టి అక్రమచర్యలు కేవలము ఉద్యోగ ధర్మమునకు విరుద్ధముగా నాచరించు అధికారులదే కాని ప్రభుత్వాజ్ఞ లెందును అట్లుచేయుటకు అనుమతింపని మాట అటుండ ప్రభుత్వము వారి దృష్టికిట్టి దౌర్జన్యములు వచ్చినప్పుడెల్లను సరియగు విచారణలు చేయుచు వచ్చినారని చెప్పవలెను.

## ఆత్మస్వాతంత్ర్యము

నిజాం ప్రభుత్వము వారికి సర్వాధికారములున్నవి. కేవలము న్యాయ శాస్త్ర బద్ధమైన అధికారము లేకాక ఇతరాధికారములును వారికి కలవు. వారు బయటినుండివచ్చు పత్రికలను లోపలికిరాకుండ నిషేధింపగలరు. ఈమాసములోపలనే సుమారు ౨౫ పత్రికలను లోపలికిరానీయకుండ నిషేధించినారు. మరియు బయటివారిని అవసరమనితోచిన రాష్ట్రములో రాకుండునట్లుగా నిరోధించగలరు. లోపలివారిని అవసరమనితోచిన రాష్ట్రము వెలుపలికి (షర్ బదర్ చేసి) పంపవచ్చును. లేదా ఒక ప్రత్యేకస్థానములోనే యుండునట్లు (నజర్ బంద్) చేయవచ్చును. మరియు మున్ననూరు అను మహబూబునగరముజిల్లాలోనిఉన్న తశ్శీతల ప్రదేశమునకు విచారణాలుచేయకయే పంపవచ్చును. ఇట్టి ఆజ్ఞలు బాబె హుకూమతువారు మ. ఘ. వ. నిజాంప్రభువుగారికి తెలిపిచేయుదురు. లేదా శ్రీప్రభువుగారే ఫర్మానుద్వారా శ్రీముఖమియ్యవచ్చును.

# న్యాయస్థానములు

హైదరాబాదు ఉన్నతన్యాయస్థానము ఫర్మానుద్వారా అధికారము (Royal Charter) పొందినట్టిది. బ్రిటిషిండియాలో కావింపబడని మార్పు ఈరాష్ట్రములో జరిగినది. న్యాయశాఖను కార్యనిర్వాహకశాఖనుండి వేరుచేసినారు. ఉన్నత న్యాయస్థానమందు తీర్పులును స్వతంత్రమైనవి. బ్రిటిషిండియాలోనుండు ఆచారమొకటిమాత్ర మింకను ఇచ్చట వర్తించుటలేదు. న్యాయస్థానములలో సాక్ష్యములు, వాఙ్మూలములు, సమనులు, దావాలు అన్నియు ఉర్దూలో జరుగుచున్నవి. దేశభాషలలో బ్రిటిషిండియాలోవలె యివన్నియు నుండవలెనని ప్రజలు బహుకాలమునుండి ఆందోళనము చేయుచున్నారు. వాక్స్వాతంత్ర్య విషయములో ౧౩౩౭ ఫసలీలో నొకతీర్పు హైకోర్టులో జరిగెను. సూర్యాపేటలో నొక సభకు నిరోధములు కల్పింపగా నొకఅభియోగము ఉన్నత న్యాయస్థానములో తేబడెను. అందు ఇప్పుడు న్యాయమూర్తిగా నుండునట్టి నవాబు అస్గరుయార్జంగుబహాదరుగారు వకీలుగా పనిచేసిరి. ఆ కేసు వివరములు దక్కనులా రిపోర్టులో సంపుటము ౧౭ పుట౨౧౯లో (శేషాద్రి బనాం సర్కారెఆలీ) అను కేసులోముద్రితమైనవి. నల్లగొండలో ఒక గ్రంథాలయ వార్షికోత్సవము చేయదలచి తన్నిర్వాహకులు కేవలము విజ్ఞానవిషయములనుగురించే ఉపన్యాసములుజరుగుననియు ఆసభకు సెలవియ్యవలెననియు తాలూకాదారువద్ద దరఖాస్తు పెట్టిరి. అందుపై తాలూకాదారు తన కే గష్తీ ౫౩ ప్రకారము సెలవిచ్చు అధికారముండియు జిల్లా న్యాయస్థానాధికారి (నాజిం) సెలవుపొందమని ఆజ్ఞాపించెను.

జిల్లా నాజిముగారు పోలీసువారి అభిప్రాయముకోరిరి. పోలీసువారు ఉపన్యాసములు బహుశా రాజకీయ పరిణామము పొందునేమో అని ఉపన్యాసకుల పేరులనుబట్టి వారిచర్యలనుబట్టి ఊహించికొని తమఅభిప్రాయము తెలిపిరి. అందుపై నాజిముగారును ఏమి

యు తేల్చక బాబెహుకూమతు సెలవుపొందుమని ఆజ్ఞాపించిరి. మరల నాజింగారి కోరికప్రకారము సభలు జరుగబోవు కార్యక్రమ వివరములు తెలుపుచు దరఖాస్తు ఇచ్చిరి. అదియు త్రోసివేయ బడెను. అందుపై హైకోర్టులో నిగరానీ చేయబడెను హైకోర్టు న్యాయమూర్తులిద్దరు విషయములన్నియు విని యిట్లు తీర్పు చెప్పిరి.

"ఫర్మానులోని రాజకీయములకై ఏర్పడిన బంధనములను రాజకీయేతర సభలకు వినియోగించకూడదు.

"ఉపన్యాసములు కాకయుండే ఒకసభ రాజకీయసభయా కాదా అను విషయమును నిర్ణయించుట యెల్లప్పటికిని కష్టమే- ఎవ్వరు ఫర్మానుకు విరుద్ధముగా నడుతురో వారి చర్య న్యాయవిరుద్ధమైనదగును. అప్పుడు న్యాయాధికారి విచారించి నేరము స్థిరపడిన శిక్షింపవచ్చును కాని ముందు ముందుగానే న్యాయాధికారి జోక్యము కలిగించుకొనుటకు అధికారము లేనివాడైయున్నాడు."

ఈ తీర్పు చాల ముఖ్యమైనట్టిది. వాగ్నిరోధవిషయమున మొత్తము హైద్రాబాదు న్యాయస్థానచరిత్రలో ఇదొక్కటే తీర్పు మనకు కనబడుచున్నది. కాని యీ తీర్పుఅయిన తర్వాతకూడ నేటివరకు ప్రతిసభకును ఏదోవిధమగు అడ్డంకులు కలుగుచు వచ్చుటనుజూడ న్యాయస్థానముకన్న కార్యనిర్వాహకశాఖయే చాల బలీయమైనదని స్పష్టమగుచున్నది.

## వ్యాయామములు

హోంసెక్రెటరీ కచ్చేరినుండి ౨౯ ఖుర్దాదు ౧౩౪౫ ఫసలీలో అఖాడాల (వ్యాయామశాలల విషయమై) యీ క్రింది విధముగా ఆజ్ఞలు కావింపబడెను.

(౧) వ్యాయామ శాలను స్థాపించువాడు దాని యుద్దేశము, దానిలో వ్యాయామము చేయువారి పేరులు, సభ్యుల పేరులు, నౌకరుల పేరులు మున్నగువివరణలు వ్రాసి జిల్లాలో తాలూ

కారువద్దను నగరములో కొత్వాలువద్దను దరఖాస్తు పెట్ట వలెను. పై అధికారుల విచారించి ఆక్షేపణీయాంశములు లేకున్న సెలవియ్యగలరు.

(౨) వ్యాయామ స్థలమును మార్చినట్లైన ఒక వారములో ఆవిష యమును అధికారికి తెలుపవలెను.

(3) అధికారులు ఈ వ్యాయామశాలలు కేవలము వ్యాయా మమువరకు మాత్రమే బద్ధమై యుండునట్లును ఏవిధమైన రాజకీయవ్యవహారదృష్టి అందులో లేనట్లును విచారించు కొనుచుండగలరు.

(౪) అప్పుడప్పుడు అధికారులు వ్యాయామశాలల తనఖీ చేయు చుండవలెను.

(౫) రాజకీయములైనను లేక వ్యాయామములుకానట్టి విషయ ములైనను యుండిన అట్టి వ్యాయామశాలలను మూసివేయ వలెను.

ఇవి వ్యాయామశాలల నియమావళిలోని ముఖ్యాంశములు- ఈ నియమావళి యనంతరము హైదరాబాదునగరములోను ఇతర ప్రాంతములలోను చాలా వ్యాయామశాలలు మూసివేయ బడెను.

# విద్య

౧౩౩౪ ఫసలీలో ఖాన్గీ (ప్రైవేటు) పాఠశాలలనుగురించి విద్యాశాఖవారు ఒకనియమావళిని ప్రవేశపెట్టిరి. అందలిముఖ్యవిష యము లిట్లున్నవి.

(౧) ౧౫ విద్యార్థులకన్న ఎక్కువమందికలిగిన పాఠశాలలు అవి ప్రభుత్వమువారి సహాయము పొందనట్టివైన ఖాన్గీపాఠశాల లన బడును.

(౨) ప్రైమరీ పాఠశాలలికముందు జిల్లా డివిజనల్ ఇన్స్పెక్టర్ సె లవు లేనిది స్థాపించకూడదు. మాధ్యమిక పాఠశాలలను

ఉన్నత పాఠశాలలను స్థాపించవలెనన్న విద్యా శాఖాధికారి సెలవుపొంద వలసియుండును.

(3) ఖాస్గీపాఠశాలలలో అన్ని మతముల వారికిని చేరుటకుసమా నాధి కారము కలదు.

(౪) ఇతర మతములవారికి బాధకలిగించు మతబోధ ఖాస్గీబళ్లలో చేయగూడదు.

(౫) ప్రభువుగారియెడను లేక ప్రభుత్వమునెడను విముఖత్వము ను కలిగించు రాజకీయపులేక రాజకీయేతరపు విద్యను బోధించ గూడదు.

(౬) ఎచ్చట నైన సెలవు లేనిది ఖాస్గీపాఠశాల స్థాపించబడిన జిల్లా తాలూకాదారు ద్వారాలేక నగర కొత్వాలుద్వారా ఆ పాఠశాలలు మూసి వేయించ బడును-

(౭) అధికారులు ఖాస్గీ బళ్లకు సెలవియ్య వచ్చును. లేదా కారణ ములుచూపి నిరాకరించ వచ్చును.

ఈ నియమావళి ఫలితముగా ఖాస్గీ పాఠశాలల సంఖ్యయు అందలి విద్యార్థుల సంఖ్యయు తగ్గిపోయినది. ఎట్లనగా

ఈ నియమావళికి పూర్వము ౧333 ఫసలీలో

ఖాస్గీ బళ్లు ౪౦౫3 విద్యార్థులు ౭౬౬౫౪

ఈ నియమావళి అనంతరము ౧3౪౫ ఫసలీలోనివిద్యాశాఖ వారి నివేదిక ప్రకారముగా

| ఖాస్గీబళ్లు, | విద్యార్థులు, |
|---|---|
| ౯౨౯. | ౨౫౧౬౫. |

అనగా ఊరపిచ్చుకమీద బ్రహ్మాస్త్రము పడినదన్న మాట. ౧33౪ ఫసలీనుండి నేటివరకు— ఈ ౧3 సంవత్సరముల నుండియు ప్రజలు, అనేక సభలుచేసి ఈ విద్యానిరోధక నియమావళిని రద్దుచే యుటకై ప్రభుత్వము వారిని ప్రార్థించు చున్నారు. కాని యేమియు ఫలితము లేకపోయినది.

# ప్రజాసంరక్షణము.

పరిస్థితులిట్లుండగా కొన్ని దినముల క్రిందటనే ప్రజాశాంతి సంరక్షక శాసనము అను పేరునొక కఠినశాసనమును (బాబెహాలుకుమతు) కార్యనిర్వాహక వర్గమువారు కావించియున్నారు. శాసనము పేరుమాత్రము ముద్దుగానున్నది. కాని అందలి విషయములు భయంకరముగా నున్నవి. బ్రిటిషిండియాలో అసహాయోద్యమమును అణచివేయుటకై క్రిమినల్‌లా అమెండుమెంట్ శాసనము కావింపబడి యుండెను. అందునను పంజాబు యొక్కయు, మద్రాసు యొక్కయు శాసనములు అతికఠినముగా నుండునవి. ఆశాసనములోని విషయములన్నియు సంగ్రహించి మనరాష్ట్రములో పైశాసనము కావింపబడినది. ఇకముందు బయటివారు లోపలికివచ్చి రాష్ట్ర వ్యవహారములలో జోక్యము కలిగించుకొనగూడదు. ౧౫ ఏండ్లకన్న తక్కువ కాలమువరకు ఈ రాష్ట్రములో బయటివారు నివాసముచేసిన వారిని రాష్ట్రేతరులుగా భావింతురు. అట్టివారు ఏమైన అపసవ్యపుపనులను జేసిన వారిని బయటికి గెంటివేయుదురు. హోటళ్ల యజమానులు రిజిస్టరులుంచి బయటివారు తమవద్ద బసచేసిన ప్రభుత్వమువారికి వెంటనే తెలుపవలెను. అక్రమసంఘములనుగా ప్రభుత్వమువారు ప్రకటించినట్టి సంఘములలో సభ్యులుగా నుండువారికి శిక్షలు వేయబడును. బయటివారిని ఆత్మసంరక్షణార్థము ప్రభుత్వానుమతిలేనిది యెవ్వరును నియోగించుకొనకూడదు. ఈ విధముగా అనేకవిధములగు కఠిననియమములను ప్రభుత్వమువారు కావించియున్నారు.

మొత్తముపై ఒక్క హైద్రాబాదు రాష్ట్రమందే కాక దేశీయ సంస్థానములందంతటను ప్రజా ప్రాథమికస్వత్వములు ఇంచుమించుగా లేవనియే చెప్పవలసియుండును. పెద్దపెద్ద దేశీయసంస్థానములందంతటను ఇప్పుడు ప్రజలు తమకు ప్రాథమికస్వత్వములు కావలె

ననియు, తమ రాష్ట్రములో బాధ్యతాయుతప్రభుత్వము వర్తించవలసియుండుననియు కోరుచున్నారు.

ప్రతి నాగరిక ప్రభుత్వములోను ఈనాడు ప్రాథమికస్వత్వములు రాజ్యాంగశాసనములో ప్రత్యేకము పేర్కొనబడియున్నవి_ ఇంగ్లాండు, ఫ్రాంసు, అమెరికా, స్విట్జర్లాండు, రష్యా, దేశములలోని ప్రాథమికస్వత్వముల విషయమై ప్రత్యేకముగా చర్చించియుంటిమి. ఆదేవిధముగా మరికొన్ని దేశములను గురించి చర్చించుట అవసరముగానుండెను కాని విషయబాహుళ్యమగునని యట్లు చేయనైతిమి. అయినను డెన్మార్కు, స్వీడన్, నార్వే, హాలెండు, బెల్జియం, అను నితరమైన యూరోపు దేశములలో, వివరణగా విశదముగా, ఆయా దేశములందలి, రాజ్యాంగశాసనములలో ప్రజల ప్రాథమిక స్వత్వము లంగీకరింపబడియున్నవి. అభిలాషులైన వారా రాజ్యాంగ శాసనములనుగూడ నొకసారి చదివిన బోధపడును.

భారతదేశమందు దినదినమును తీవ్రమైన మార్పులు కలుగుచున్నవి. ప్రజలు జాగ్రదవస్థలోనికి వచ్చినారు. బ్రిటిషువారును ఈ విషయమును గమనించి క్రమక్రమముగా ప్రజాహితమగు మార్గమున వర్తించుచున్నారు. దేశీయప్రభువులును తాము కాలానుగుణ్యముగా వర్తించుకొనుట తమకే శ్రేయోదాయకమని ప్రత్యేకముగా బోధింప నవసరములేదు.

సమాప్తము.